
# ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 31.0
కనిష్ఠం 23.2
****

ANDHRAJYOTHY



# నల్లగొండ

5

శనివారం 20 సెప్టెంబరు 2025


ప్రాజెక్టుల నీటిమట్టం

| ప్రాజెక్టు | పూర్తిస్థాయి | ప్రస్తుతం | ఇన్‌ఫ్లో | అవుట్‌ఫ్లో |
|---|---|---|---|---|
| | నీటి మట్టం (అడుగులు) | | (క్యూసెక్కులు) | |
| సాగర్ (టీఎంసీలు) | 590 (312.0450) | 587.20 (305.6242) | 2,78,066 | 2,81,377 |
| మూసీ (టీఎంసీలు) | 645 (4.46) | 643.95 (4.18) | 4,704.02 | 4,255.35 |
| పులిచింతల (టీఎంసీలు) | 175 (45.77) | 172.209 (41.5360) | 2,44,320 | 2,30,351 |

చికెన్ ధరలు | లైవ్ : రూ.152 | డ్రెస్ : రూ.230 | స్కిన్‌లెస్ : రూ.260



నాంపల్లిలో యూరియా కోసం బారులు తీరిన రైతులు

## మూడున్నర నెలలు..
# 66 వేల మెట్రిక్ టన్నులు

వానాకాలం సీజన్‌లో జిల్లాలో ఈ మూడున్నర నెలల్లో 66 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు విక్రయించారు. ఈ సీజన్‌కు సంబంధించి మొత్తం 70 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉంటుందని వ్యవసాయశాఖ అంచ నా వేసి ప్రభుత్వానికి ఇండెంట్ పెట్టింది. కాగా, ఇప్పటి వరకు 66వేల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా జరిగింది. ఇంకా మరో 4వేల మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాకు రావాల్సి ఉంది.
- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ)

- ఇక రావాల్సిన యూరియా కోటా 4వేల మెట్రిక్ టన్నులు
- అక్టోబరు మొదటి వారంలో నాన్ ఆయకట్టులో వరి కోతలు
- యూరియా కోసం కాస్త ఒత్తిడి తగ్గే అవకాశం

వ్యవసాయ అధికారులు ప్రభుత్వానికి నివేదించిన విధంగా యూరియా సరఫరా చేసే సమయంలోనే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో కొరత ఏర్పడింది. దీంతో జిల్లాలో కూడా కొద్ది రోజులుగా యూరియా కోసం రైతులు రోడ్డెక్కుతున్నారు. శుక్రవారం నాంపల్లి, చింతపల్లి మండలాల్లో యూరియా కోసం రైతులు బారులు తీరారు. అయితే జూన్, జూలైలో పెద్దగా వర్షాలు లేకపోవడంతో ఆగస్టులో కురిసిన వర్షాలకు పత్తి విత్తనాలు వేయడంతో పాటు వరినాట్లు ముమ్మరమయ్యాయి. సెప్టెంబరులోనూ ఆడపదడపా వర్షాలు కురియడంతో రైతులు ఎరువుల కోసం ఎగబడ్డారు. దీంతో ఎరువుల సరఫరా వ్యవసాయ అధికారులకు సమస్య గా మారింది. కర్నాటక, మహారాష్ట్రలో భారీ వర్షా లు కురవడంతో నాగార్జునసాగర్ రిజర్వాయర్‌కు వరద రావడాన్ని గమనించి ఆయకట్టు రైతులు జూలై మాసంలోనే పెద్ద మొత్తంలో యూరియాను కొనుగోలు చేసి నిల్వ చేసినట్టు చర్చ సాగింది. ఆ తరువాత సాగర్ పూర్తిగా నిండి ఎడమ కాల్వకు నీటి విడుదల ప్రారంభమవడంతో సాగర్ ఆయకట్టు కింద ముమ్మరంగా నాట్లు కొనసాగడంతో యూరియా అవసరం మరింత పెరిగింది. జిల్లాకు ఈ మూడున్నర నెలల్లో అంటే జూన్ నుంచి సెప్టెంబరు మూడో వారం వరకు 66వేల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా కాగా, ఆ మొత్తాన్ని రైతులకు విక్రయించారు. ఇంకా కోట ప్రకారం మరో 4వేల మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాకు రావాల్సి ఉంది.

### 11లక్షలకు పైగా ఎకరాల్లో పంటల సాగు

జిల్లాలో 11.6లక్షల ఎకరాల్లో పత్తి, వరి సాగైంది. 5.68లక్షల ఎకరాల్లో పత్తి సాగు కాగా, 5.38లక్షల ఎకరాల్లో వరి సేద్యమైంది. గత ఏడాది కంటే 40వేల ఎకరాలు అధికంగా పత్తి, వరి పంటలు సాగయ్యాయి. నాన్ ఆయకట్టులో అధికంగా పత్తి సాగు కాగా, ఆయకట్టుతో పాటు నాన్ ఆయకట్టులోనూ వరిసాగైంది. ఈసారి..

- మిగతా 8వ పేజీలో...

### రైతులకు ఇబ్బందులు లేకుండా యూరియా



రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లాలో రైతులకు యూరియా కొరత లేకుండా సరఫరా చేస్తున్నాం. ఇప్పటికే 66వేల మెట్రిక్ టన్నుల యూరియాను చేరవేశాం. ఎప్పటికప్పుడూ పర్యవేక్షణ చేస్తూ క్షేత్రస్థాయిలో రైతులకు ఇబ్బందులు రాకుండా చూస్తున్నాం. నిరంతరం మండల వ్యవసాయ అధికారులతో సమీక్షలు నిర్వహిస్తున్నాం. మరో 10 రోజుల్లో నాన్ ఆయకట్టులో వరి కోతలు ప్రారంభంకానున్నాయి. పత్తి తీత కూడా మొదలవనుంది. దీంతో యూరియా అవసరం తగ్గుతుంది. ఇప్పటికే పత్తి చేలకు రైతులు యూరియాను నిలిపివేశారు. పత్తి పంటకు ప్రస్తుతం యూరియా అవసరం లేదు. ఆయకట్టులో వరిచేలకు కొంత మేర యూరియా అవసరం ఉంటుంది.
- పి.శ్రవణ్‌కుమార్, జేడీఏ

# అందని కాస్మెటిక్, డైట్‌చార్జీలు

### మూడు నెలలుగా విద్యార్థుల ఎదురుచూపులు



(ఫైల్)

విద్యాసంవత్సరం ప్రారంభంలోనే విద్యార్థులకు అందించాల్సిన కాస్మెటిక్, డైట్ చార్జీలు మూడు నెలలు కావస్తున్నా నేటికీ అందలేదు. దీంతో కనీస అవసరాల కోసం గురుకులాల్లో చదువుకునే పేద విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికి తోడు దుస్తులు కూడా ఇవ్వకపోవడంతో పాతవాటితోనే కాలం వెల్లబుచ్చుతున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 79 గురుకులాల్లో 5వ తరగతి నుంచి డిగ్రీ వరకు 37,500 మంది విద్యనభ్యసిస్తున్నారు. వీరెవరికీ కాస్మెటిక్, డైట్ చార్జీలతో పాటు దుస్తులు అందించ లేదు. చార్జీలను పెంచిన ప్రభుత్వం సకాలంలో అందిస్తే మేలు చేసినట్లవుతుందని విద్యార్థులు, తల్లిదండ్రులు పేర్కొంటున్నారు.
(ఆంధ్రజ్యోతి-కోదాడ)

6

## సాగునీటి లెక్కల్లో
# తేడాలు లేకుండా చూడాలి

- కేఆర్ఎంబీ చైర్మన్ బీపీ పాండ్యే
- ఎడమ కాల్వ, ప్రధాన జలవిద్యుత్ కేంద్రాల వద్ద టెలిమెట్రీల పరిశీలన

7



# మహిళలకు అండగా 'భరోసా'

### ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): లైంగిక వేధింపులకు గురైన బాధిత బాలికలకు, మహిళలకు 'భరోసా' కేంద్రం అండగా నిలుస్తోందని ఎస్పీ శరత్ చంద్ర పవార్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని భరోసా కేంద్రాన్ని ఆయన తనిఖీచేసి కార్యాలయంలోని రికార్డులు, సిబ్బంది విధులు, బాధిత మహిళలు, పిల్లల రక్షణకు తీసుకుంటున్న చర్యలు, వైద్య, మానసిక కౌన్సెలింగ్, అవగాహన కార్యక్రమాల పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, లైంగిక దాడులకు, వేధింపులకు గురవుతున్న బాలల పట్ల, మహిళల పట్ల మానవతా దృక్పథంతో పని చేయాలని, వారికి సామాజిక అభద్రతా భావం ఏర్పడకుండా ధైర్యం కల్పించాలన్నారు. ఎప్పటికప్పుడు న్యాయ, వైద్య సహాయం, మానసిక ధైర్యం కల్పించాలన్నారు. లైంగిక వేధింపులపై మహిళలు ధైర్యంగా ఫిర్యాదు చేయాలన్నారు. మహిళలు, బాలల రక్షణ చట్టాలు బలోపేతమయ్యాయని, ఎవరైనా వేధింపులు, లైంగిక దాడులకు పాల్పడితే జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు. పిల్లలపై లైంగిక దాడులు చేస్తే పోక్సో చట్టం కింద జీవితకాలం శిక్ష పడుతుందన్నారు. సాంకేతికత ఆధారాలతో నాణ్యమైన దర్యాప్తును చేస్తున్నామని తెలిపారు. ఇప్పటి వరకూ జిల్లాలో 19 పోక్సో కేసుల్లో, 20 మంది నిందితులకు శిక్షలు విధించడం జరిగిందన్నారు. లైంగిక వేధింపులకు గురైన బాధిత కుటుంబానికి ఆర్థిక పరిహారం అందిస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట అదనపు ఎస్పీ రమేష్, మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ కరుణాకర్, భరోసా సెంటర్ ఎస్ఐ అంజలి, షీటీమ్స్ ఎస్ఐ గౌస్, భరోసా సెంటర్ కో ఆర్డినేటర్ నళిని, తదితరులు ఉన్నారు.

# ఆసక్తి కలిగించేలా బోధన ఉండాలి

### డీఈవో భిక్షపతి




రాష్ట్రస్థాయికి ఎంపికైన ఉపాధ్యాయురాలికి ప్రశంసాపత్రం అందజేస్తున్న డీఈవో భిక్షపతి

నల్లగొండ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): బోధన అభ్యసన ప్రక్రియలతో విద్యార్థులకు పాఠ్యాంశాలపై ఆసక్తి పెరుగుతుందని డీఈవో భిక్షపతి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాలలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి బోధన అభ్యసన సామగ్రి (టీఎల్ఎం) మేళాను ఆయన ప్రారంభించి మాట్లాడారు. టీఎల్ఎం ద్వారా ఉపాధ్యాయులు బోధనను అత్యంత ప్రతిభావంతంగా నిర్వహించవచ్చన్నారు. బోధన అభ్యసన ప్రక్రియల ద్వారా విద్యార్థులకు సులభతరంగా అర్థం కావడంతో పాటు ఆలోచనా విధానం పెరుగుతుందన్నారు. అనంతరం జిల్లాలోని 342మంది ఉపాధ్యాయులు రూపొందించిన టీఎల్ఎంలను ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలో అత్యుత్తమమైన 8 టీఎల్ఎంలను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన ఉపాధ్యాయులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష కోఆర్డినేటర్ ఆర్.రామచంద్రయ్య, డైట్ లెక్చరర్ నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**రాష్ట్రస్థాయికి ఎంపికైంది వీరే:** డి.కల్పన (గొల్లగూడ జీపీఎస్, నల్లగొండ), టీ.వనిత (ఉప్పలపహాడ్ ఎంపీపీఎస్, కేతేపల్లి), సంపత్ (ఎంపీపీఎస్ థానేదార్ పల్లి, గుర్రంపోడు), ఎ.శ్రీనివాసులు (ఎంపీపీఎస్ ఇటుకలపహాడ్, శాలిగౌరారం) ఎల్.శ్రీను (ఎంపీపీఎస్ కోయబోరెనిబాలు, గుర్రంపోడు), డి.శ్రీనివాస్‌రెడ్డి (ఎంపీపీఎస్ కేశంనేనిపల్లి), జీ.అరుణ (ఎంపీపీఎస్ దాసరినెమలిపురి, గుండ్లపల్లి)

# విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

### డీఎంహెచ్‌వో శ్రీనివాస్



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో శ్రీనివాస్

చండూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా వైద్యాధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం చండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 'స్వస్థ్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్' ద్వారా ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డితో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహిళలకు అవసరమైన వైద్య సేవలు అందించడంతో పాటు దీర్ఘకాలిక వ్యాధులను గుర్తించి వైద్యం అందించాలన్నారు. వైద్య సిబ్బంది హాజరు, వ్యాక్సిన్, మందుల నిల్వలను పరిశీలించారు. ఆయన వెంట మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బ్లెసీ ఉన్నారు.

# పోషణ మాసాన్ని నిర్వహించాలి

### కలెక్టర్ ఇలా త్రిపాఠి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ టౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పోషణ మాసం ఉత్సవాలను వినూత్నంగా నిర్వహించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు అక్టోబరు 16వ తేదీ వరకు పోషణ మాసం నిర్వహించాలన్నారు. అందులో భాగంగా ప్రతీ రోజు వివిధ స్థాయిల్లో పలు కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. పాలిచ్చే తల్లులకు కౌన్సిలింగ్, ఎక్కువ బరువును తగ్గించే ఆహారంపై అవగాహన కల్పించాలన్నారు. పిల్లలకు పోషకాహారం అందజేయడంలో పురుషులను భాగస్వామ్యం చేయడం, స్థానిక వంటకాలను ప్రోత్సహించడం, పిల్లలు ఆడుకునేందుకు స్థానికంగా దొరికే చెక్క బొమ్మలు, కర్ర బొమ్మలు, మట్టితో తయారు చేసిన బొమ్మల వాడకంపై అవగాహన కల్పించాలన్నారు. పౌష్టికాహార మిషన్ కింద 100 రోజుల ప్రణాళికను రూపొందించాలని సూచించారు. యోగ, రక్తహీనతపై అవగాహన సదస్సులు, గ్రామ, వార్డు సభల నిర్వహణ, కిచెన్ గార్డెన్ల పెంపకం, పోషణ వాటికల నిర్మాణం, చేతులు శుభ్రంగా కడుక్కోవడం, తాగునీరు, పరిశుభ్రత వంటి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. సొంత భవనాలు ఉన్న 625 అంగన్‌వాడీ కేంద్రాల్లో కనీసం 425 ప్రాంతాల్లో కిచెన్ గార్డెన్లు నిర్వహించాలన్నారు. ప్రహరీలు లేని అంగన్‌వాడీలకు బయో కంచె ఏర్పాటు చేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు భవనాల నిర్మాణానికి స్థలాలను గుర్తించాలన్నారు. స్థానిక శాసనసభ్యుల సహకారంతో సీడీపీవోలు ఒక రోజు పోషణ మాసోత్సవాలను ఘనంగా నిర్వహించాలని అన్నారు. అనంతరం పోషణ మాసంపై రూపొందించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్, జేడీఏ శ్రవణ్‌కుమార్, ఆర్డీవో వై.అశోక్ రెడ్డి, డీఆర్డీవో శేఖర్‌రెడ్డి, శిశు సంక్షేమశాఖ జిల్లా అధికారి కృష్ణవేణి, డిప్యూటీ డీఎంహెచ్‌వో వేణుగోపాల్‌రెడ్డి, పాల్గొన్నారు.

### ఇసుకను అభివృద్ధి పనులకు ఉపయోగించాలి

వంగమర్తి ఇసుక రీచ్‌లో పూడిక ద్వారా తీసిన 5.50లక్షల మెట్రిక్ టన్నుల ఇసుకను ప్రభుత్వ అభివృద్ధి పనులకు వినియోగించుకునేందుకు జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం తీర్మానించింది. ఈ మేరకు కలెక్టర్ ఇలా త్రిపాఠి అధ్యక్షతన శుక్రవారం జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం నిర్ణయం తీసుకుంది. మే నెలలో నిర్వహించిన జిల్లాస్థాయి సమావేశంలో వంగమర్తి ముంపు ప్రాంతంలో సుమారు 8 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుకను అభివృద్ధి పనులకు వినియోగించుకోవాలని ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ఇరిగేషన్ ప్రాజెక్టులకు ఈ ఇసుకను ఇప్పటివరకు వినియోగించుకోనందున దాన్ని సద్వినియోగం చేసుకునేందుకు కమిటీ చర్చించి 5.50లక్షల మెట్రిక్ టన్నుల ఇసుకను కేటాయించింది. ఈ ఇసుకను టీజీఎండీసీకి బదలాయించడం ద్వారా అక్కడి నుంచి ఇరిగేషన్ ప్రాజెక్టులు, ఇందిరమ్మ ఇళ్ల సాండ్‌బజార్‌కు కేటాయించేలా తీర్మానించారు. దీంతోపాటు జిల్లాలో మరో ఐదు ఇసుక రీచ్‌లను గుర్తించి వాటి ద్వారా ఇసుకను ఇచ్చేందుకు చర్చించారు. బ్రాహ్మణపల్లి తండ, వావిల్ కోల్ రీచుల నుంచి డిండి, చందంపేట, పెద్దవూర, పీఏ.పల్లి, కొండమల్లేపల్లి మండలాల్లోని ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక సరఫరాకు తీర్మానించారు. కనగల్ మండలం ఎం.గౌరారం నుంచి అనుముల, గుర్రంపోడు, పెద్దవూర, తిరుమలగిరిసాగర్, త్రిపురారం, కనగల్ మండలాలకు, వంగమర్తి, చిత్తలూరు మూసీ ఎగువ ప్రాంతం నుంచి తీసిన ఇసుకను కేతేపల్లి, కట్టంగూర్, నకిరేకల్ మండలాల్లోని ఇందిరమ్మ ఇళ్లకు ఇవ్వాలని నిర్ణయించారు. తాటికల్‌లో గత ఫిబ్రవరిలోనే ఏర్పాటుచేసిన ఇసుక రీచ్ నుంచి తక్షణమే ఇసుకను సరఫరా చేసేందుకు సమావేశం అంగీకరించింది. చిట్యాలో ఇసుక కొరతను తీర్చేందుకు అవసరమైన మేర సరఫరాకు సమావేశం ఆమోదించింది. సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, మైన్స్ ఏడీ శామ్యూల్ జాకబ్, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

# బిల్లు చెల్లిస్తేనే స్టేషనరీ!

- జిల్లాలో సుమారు రూ.25లక్షల మేర బకాయిలు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఈజీఎస్ సిబ్బంది




ఉపాధిహామీ పథకం నార్కట్‌పల్లి కార్యాలయం, మరమ్మతులకు నోచుకోని కంప్యూటర్, ప్రింటర్

నార్కట్‌పల్లి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖకు చెందిన (ఈజీఎస్) ఉపాధి హామీ పథకం అమలు కార్యాలయాలకు ఏడాదిన్నరగా స్టేషనరీ బిల్లులు మంజూరు కావడం లేదు. దీంతో స్టేషనరీ కొరత ఏర్పడి ఈజీఎస్ కార్యాలయాల సిబ్బంది తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. జిల్లా అధికారులు రోజువారీ అడిగే వివరాల తయారీ కోసం వినియోగించే కాగితాలు, ఇతర స్టేషనరీ వస్తువుల్లో అత్యవసరమైన వాటిని ఈజీఎస్ ఏపీవో లేదా కార్యాలయ సిబ్బంది ఎవరో ఒకరు సొంతంగా వెచ్చించి సమకూర్చుకుంటున్నారు. ఏడాదిగా బిల్లులు ఇవ్వకపోవడంతో కొన్నేళ్లుగా అరువుగా ఇస్తున్న స్టేషనరీ షాపు నిర్వాహకులు నిరాకరిస్తున్నారని ఈజీఎస్ సిబ్బంది వాపోతున్నారు. జిల్లాలో ఒక్కో ఈజీఎస్ కార్యాలయానికి సుమారు రూ.65వేలకు పైగా బకాయి బిల్లులు రావాల్సి ఉంది. జిల్లా వ్యాప్తంగా సుమారు రూ.25లక్షలకు పైగా బకాయి ఉన్నట్టు తెలిసింది.

### కేటగిరీ వారీగా స్టేషనరీ బిల్లులు

జిల్లాలోని అన్ని మండలాల ఉపాధి హామీ కార్యాలయాలకు ఒకే రకమైన స్టేషనరీ నిధుల మంజూరు లేదు. స్టేషనరీ ప్రొవిజన్‌కు మండలాలను నాలుగు కేటగిరీలుగా గుర్తించి ప్రతీ (ఆర్థిక సంవత్సరం) ఏడాది కేటాయిస్తున్నారు. ఈజీఎస్ పనిదినాలనే ప్రామాణికంగా చేసుకుని స్టేషనరీ బిల్లులు ఇస్తున్నారు. ఏ, బీ, సీ, డీ కేటగిరీలుగా వర్గీకరించి బిల్లుల కేటాయింపు చేస్తున్నారు. వీటిలో 3లక్షల పనిదినాలకు పైగా ఉన్న మండలాలను ఏ-కేటగిరీ, 2లక్షల నుంచి 3లక్షల పనిదినాలు నమోదైన మండలాలను బీ-కేటగిరీగా, లక్ష నుంచి 2లక్షల పనిదినాలు నమోదైన మండలాలను సీ-కేటగిరీగా, లక్షకు తక్కువ పనిదినాలు నమోదవుతున్న మండలాలను డీ-కేటగిరీగా గుర్తించి బిల్లులు ఇస్తున్నారు. వీటిలో ఏ-కేటగిరీకి ఏడాదికి రూ.1,00,000, బీ-కేటగిరీకి రూ.85,000లు, సీ-కేటగిరీకి రూ.75,000, డీ-కేటగిరీ మండలాలకు రూ.60,000లు బిల్లులు ఇస్తున్నారు.

### ఏడాదిన్నరగా చెల్లించని వైనం

మండలాల నుంచి కేటగిరీ వారీగా కేటాయించిన మేరకు బిల్లులను ఏటా డీఆర్‌డీఏకు పంపిస్తారు. ఉపాధి కూలీల మస్టర్స్, వేజ్ జాబితా, వేజ్ స్లిప్స్, అంచనా తయారీ పనులన్నింటికీ కలిసి సుమారు 200 వరకు పేపర్ బండిళ్లు అవసరమవుతాయి. కాగా, 2023-24 ఆర్థిక సంవత్సరం వరకు మాత్రమే బిల్లులు విడుదలయ్యాయి. 2024-25 కొత్త ఆర్థిక సంవత్సరం ముగిసినా బిల్లులు విడుదల కాకపోగా 2025-26 ఆర్థిక సంవత్సర స్టేషనరీ ప్రొవిజన్స్ నేటికీ కార్యాలయాలకు అందలేదు. దీంతో ఏడాదిగా కార్యాలయాలకు అరువుగా పంపిణీ చేసిన స్టేషనరీకి బిల్లులు ఇవ్వకపోవడంతో వాటిని ఇచ్చేందుకు వ్యాపారస్థులు నిరాకరిస్తున్నారని తెలిసింది. దీంతో అనివార్యమైన పరిస్థితిలో కొందరు ఏపీవోలు సొంత ఖర్చుతోనే వాటిని సమకూర్చుకుంటున్నారు.

### మరమ్మతులకు ఏఎంసీ లేదు?

దాదాపు ఏ కార్పొరేట్ లేదా ప్రభుత్వ కార్యాలయాల్లోనైనా కంప్యూటర్‌లు, డెస్క్‌టాప్, జిరాక్స్ మిషన్ల మరమ్మతులకు ఏఎంసీ ఉంటుంది. ఏటా వీటన్నింటిని సదరు ఏఎంసీ సాంకేతిక నిపుణులు వచ్చి ఒకసారి తనిఖీ చేసి ఏమైనా సమస్యలుంటే సరిచేస్తుంటారు. సాంకేతిక సమస్య వచ్చి అవి మరమ్మతులకు గురైతే ఏఎంసీ పొందిన సంస్థ సిబ్బంది వాటిని సరి చేస్తారు. ఏఎంసీ ఉంటే సర్వీస్ చార్జ్ ఇవ్వకున్నా ఏమైనా కొత్త పరికరాలకు మాత్రమే చార్జ్ చేస్తారు. కానీ, మండలాల్లోని ఈజీఎస్ కార్యాలయాల్లోని పరికరాల మరమ్మతుకు ఏఎంసీ లేదని సమాచారం.

### బకాయిలు వాస్తవమే



జిల్లాలోని 31 ఈజీఎస్ కార్యాలయంతో పాటు జిల్లా కేంద్రంలోని డీఆర్‌డీవో కార్యాలయానికి సంబంధించి ఏడాదిగా స్టేషనరీ బిల్లులు నిలిచిన మాట వాస్తవమే. సుమారు రూ.25లక్షలకు పైగా 2024-25 ఆర్థిక సంవత్సరం స్టేషనరీ ప్రొవిజన్ బిల్లులు రావల్సి ఉంది. డీఆర్‌డీవోకు కేంద్రం గ్రాంటు ఇస్తున్న కారణంగా కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ అడిగిన ప్రొఫార్మాలోనే బిల్లుల బకాయి వివరాలను రెండు రోజుల కిందటే అందజేశాం. అయితే ఆ బిల్లులు ఎపుడు వస్తాయనేది చెప్పలేను.
● శేఖర్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ

## స్థానిక సమస్యల పరిష్కారానికి
# నిధులు ఇవ్వాలి

- ఆ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే
- ఎమ్మెల్యే శ్రీనివాసరెడ్డి సూచనను సమర్థిస్తున్నా
- మెజారిటీ ఎమ్మెల్యేల అభిప్రాయం కూడా ఇదే
- ముఖ్యమంత్రి వాస్తవాన్ని గుర్తించి వ్యవహరించాలి
- ఎక్స్ వేదికగా సీఎంకు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సూచన
- 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన వ్యాసాన్ని ట్యాగ్ చేసిన ఎమ్మెల్యే



నల్లగొండ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తరచూ సంచలన వ్యాఖ్యలు, ట్వీట్లతో రాజకీయవర్గాల్లో చర్చరేకెత్తిస్తోన్న మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి శుక్రవారం ఎక్స్‌వేదికగా మరోసారి సీఎం రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి ట్వీట్ చేశారు. స్థానిక సమస్యల పరిష్కారానికి నిధులివ్వాలని సూచన చేశారు. "అసెంబ్లీ నియోజకవర్గంలోని స్థానిక సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు సమకూర్చాలి. నిధులు కేటాయించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనన్న వాస్తవాన్ని ముఖ్యమంత్రి గుర్తించి వ్యవహరించాలి" అని ఎమ్మెల్యే తన ట్వీట్‌లో పేర్కొన్నారు. సామాజిక మాధ్యమం ఎక్స్‌లో శుక్రవారం ఈ మేరకు ఆయన ఒక పోస్టును ట్వీట్ చేశారు. మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం 'ఆంధ్రజ్యోతి' ఎడిట్ పేజీలో రాసిన 'ఊరు, వాడ ఇక్కట్లు తీర్చరా.?' అనే ఆర్టికల్‌ను ఈ ట్వీట్‌కు రాజగోపాల్‌రెడ్డి జత చేశారు. అసెంబ్లీ నియోజకవర్గాల్లో స్థానిక సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు సమకూర్చాలంటూ మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి సూచనను తాను మనస్ఫూర్తిగా సమర్థిస్తున్నానని పేర్కొన్నారు. మెజార్టీ ఎమ్మెల్యేల అభిప్రాయం కూడా ఇదేనని తాను భావిస్తున్నట్లు తెలిపారు. ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు అసెంబ్లీ నియోజకవర్గ అభివృద్ధి నిధులు ఉపయోగపడతాయని అభిప్రాయపడ్డారు. సంక్షేమ పథకాలను కొనసాగిస్తూనే, స్థానిక సమస్యల పరిష్కారానికి అవసరమైన మేరకు నిధులు కేటాయించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని ముఖ్యమంత్రి గుర్తించి వ్యవహరించాలని ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ట్వీట్‌లో సూచించారు.

## యువకుడిని కాపాడిన పోలీసులు

● చిన్నేటివాగు నుంచి ఎక్స్‌కవేటర్ సాయంతో ఒడ్డుకు ...





ఎక్స్‌కవేటర్ సాయంతో యువకుడిని కాపాడిన పోలీసులు, వాగులోచిక్కుకున్న మహేష్

భువనగిరి రూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి మండలంలోని చిన్నేరువాగులో కొట్టుకుపోతున్న యువకుడిని పోలీసులు కాపాడారు. భువనగిరి రూరల్ ఎస్‌హెచ్‌వో అనిల్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం బీబీనగర్ మండలం మాదారం గ్రామానికి చెందిన అవురావేతి మహేశ్ చిన్నేరువాగు కల్వర్టుపై నుంచి రోడ్డు దాటుతున్నాడు. మూసీ ఉధృతి ఎక్కువగా ఉండడంతో మహేశ్ వరద ప్రవాహంలో కొట్టుకునిపోయి చెట్టుకొమ్మను పట్టుకుని ప్రాణభయంతో కొట్టుమిట్టాడాడు. గమనించిన అక్కడే ఉన్న కానిస్టేబుల్ నాగరాజు వెంటనే పోలీసు ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వడంతో భువనగిరి రూరల్ ఎస్‌హెచ్‌వో అనిల్‌కుమార్, భువనగిరి ట్రాఫిక్ ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్, కానిస్టేబుల్ స్టాలిన్ హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఎక్స్‌కవేటర్ సాయంతో సాహసోపేతంగా గంటపాటు శ్రమించి అతడిని ఒడ్డుకు చేర్చారు. ఎగువ ప్రాంతం నుంచి మూసీ ఉధృతి ఎక్కువగా ఉన్నందున ప్రజలు లోతట్టు కల్వర్టుల పైనుంచి ప్రయాణించవద్దని హెచ్చరించారు.

## ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యుడిపై కేసు నమోదు

సూర్యాపేట(కలెక్టరేట్), సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కోసం లబ్ధిదారుల నుంచి డబ్బులు డిమాండ్ చేసిన ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యుడిపై కేసు నమోదు చేసినట్లు సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మద్దిరాల మండలం పోలుమళ్ల గ్రామానికి చెందిన కొండ లింగన్న భార్య రమణ పేరున ఇంటిరమ్మ ఇళ్లు మంజూరు కాగా ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యుడైన అదే గ్రామానికి చెందిన పాల్వాయి సత్తయ్య తనకు రూ.10 వేలు ఇవ్వాలని లేదంటే ఇంటి అనుమతులు నిలిపివేయిస్తానని బెదిరించాడు. దీంతో లబ్ధిదారుడు కొండ లింగన్న రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ ఎండీకి టోల్‌ఫ్రీ నెంబర్ ద్వారా ఫోన్‌చేసి ఫిర్యాదు చేశాడు. ఆ మేరకు ఈ నెల 16న జిల్లా హౌసింగ్ పీడీ సిద్ధార్థ పోలుమల్ల గ్రామపంచాయతీ కార్యాలయంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు, గ్రామకార్యదర్శి సమక్షంలో పాల్వాయి సత్తయ్యను, అదేవిధంగా లబ్ధిదారులు కొండ లింగన్న-రమణ దంపతుల విచారించారు. విచారణలో సత్తయ్య రూ.10 వేలు డిమాండ్ చేసినట్లు నిర్ధారణ అయ్యిందని ప్రకటనలో కలెక్టర్ పేర్కొన్నారు. దీంతో సత్తయ్యపై మద్దిరాల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేయించడంతో పాటు సత్తయ్యను ఇందిరమ్మ ఇళ్ల కమిటీ నుంచి వెంటనే తొలగించినట్లు కలెక్టర్ ప్రకటనలో పేర్కొన్నారు.

# అందని కాస్మెటిక్, డైట్‌చార్జీలు



(ఫైల్)

- పాఠశాలలు ప్రారంభమై మూడు నెలలు
- నేటికీ అందక విద్యార్థులకు ఇబ్బందులు
- ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 79 గురుకులాలు, 37,500 మంది విద్యార్థులు

(ఆంధ్రజ్యోతి-కోదాడ)

విద్యాసంవత్సరం ప్రారంభమై మూడునెలలు గడుస్తున్నా గురుకులాల్లోని విద్యార్థులకు నేటికీ కాస్మెటిక్ చార్జీలు, దుస్తులు అందలేదు. దీంతో విద్యార్థులు ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 79 గురుకులాలు ఉన్నాయి. అందులో బీసీ 29, ఎస్సీ 18, ఎస్టీ 19, మైనార్టీ 13గురుకులాలు ఉండగా 37,500మంది 5వ తరగతి నుంచి డిగ్రీ వరకు విద్యనభ్యసిస్తున్నారు. గురుకులాల్లోని విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు ఆహారం, వసతి, క్రీడలు, నైపుణ్యాభివృద్ధిలో రాణించాలనేది ప్రభుత్వ లక్ష్యం. అంతేకాక గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలు, మూడు జతల దుస్తులు, కాస్మెటిక్స్ 12 రకాలు కొనేందుకు చార్జీలు అందజేస్తోంది. సెప్టెంబరు నెల వచ్చినా నేటికి విద్యార్థులకు దుస్తులు, కాస్మెటిక్ చార్జీలు అందలేదు. దీంతో పాత దస్తులతో తరగతులకు హాజరవుతున్నారు. పాఠ్యపుస్తకాలు సైతం మూడు రోజుల కిందట అందినట్లు సమాచారం. ప్రభుత్వం విద్య సంవత్సరం ప్రారంభంలోపే దుస్తులు, పాఠ్యపుస్తకాలు, కాస్మెటిక్ చార్జీలు అందిస్తే, విద్యార్థుల విద్యకు ఆటంకం లేకుండా ఉంటుందని విద్యార్థి సంఘాల నాయకులు పేర్కొంటున్నారు. ఈ విద్యాసంవత్సరం నుంచి కాస్మెటిక్ చార్జీలు నేరుగా విద్యార్థి ఖాతాలో వేయాలని ప్రభుత్వం భావించినప్పటికీ నేటికి ఆ ప్రక్రియ పూర్తి కాకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది ఎదుర్కొంటున్నారని చెబుతున్నారు.

| తరగతి | కాస్మెటిక్ గతంలో/ ప్రస్తుతం | డైట్‌చార్జి గతంలో/ ప్రస్తుతం |
|---|---|---|
| 5,6,7వరకు | రూ.55 /175 | రూ.950/రూ.1,330 |
| 8,9,10వరకు | రూ.75/రూ.275 | రూ.1,100 / రూ.1,540 |
| ఇంటర్,డిగ్రీ | ——— | రూ.1,500/రూ.2,100 |

### పెరిగినా చేరలే..

గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులకు ఈ విద్యాసంవత్సరం నుంచి కాస్మెటిక్ చార్జీలు, డైట్ చార్జీలను ప్రభుత్వం పెంచింది. అంతేకాకుండా ఈ ఏడాది నుంచి ఆయా నిధులను నేరుగా విద్యార్థి బ్యాంకు అకౌంట్‌కు జమచేయాలని నిర్ణయించింది. అయితే కొందరు విద్యార్థుల బ్యాంకు ఖాతా తెరవలేదు. త్వరగా విద్యార్థుల ఖాతాను ఓపెన్ చేసి, చార్జీలను ఖాతాలో జమచేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

### కాస్మెటిక్స్ ఇలా

5వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న బాల,బాలికలకు 11 రకాలు, ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు 12 రకాల కాస్మెటిక్స్ కొనుగోలుకు ప్రభుత్వం చార్జీలు అందిస్తుంది.సబ్బులు, కొబ్బరినూనె, టూత్‌పేస్ట్, బ్రష్, టంగ్‌క్లీనర్, ఫేస్‌పౌడర్, షాంపు, దుస్తులు ఉతికే సబ్బు, హెయిర్ బాండ్, రిబ్బన్లు, వాజ్‌లైన్, వాషింగ్ పౌడర్‌లను కొనుగోలు చేసుకోవాల్సి ఉంటుంది. వీటి చార్జీలు సకాలంలో అందకపోవటంతో విద్యార్థులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఇప్పటికైనా కాస్మెటిక్, డైట్ చార్జీలను విడుదల చేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

### అందని దుస్తులు

గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులకు మూడు జతల దుస్తులను ప్రభుత్వం అందిస్తోంది. అందుకు అవసరమైన టెండర్లను ఆహ్వానించి, విద్యార్థులకు సరఫరా చేస్తుంటుంది. ఇదిలా ఉంటే గతంతో పోల్చితే ప్రభుత్వం ఈ విద్యాసంవత్సరం విద్యార్థులకు అందించే దుస్తులను పంపిణీలో మార్పులు తీసుకువచ్చింది. గతంలో యూనిఫాం కొలతల కోసం విద్యార్థులను గుంపులుగా విభజించేవారు. ఒకరి కొలతల ఆధారంగా మిగతా వారికి తయారుచేసి ఇచ్చేవారు. ఆ కొలతలు సరిపడక విద్యార్థులకు ఇబ్బందులు పడేవారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత ప్రభుత్వం ప్రతి విద్యార్థికి వ్యక్తిగత కొలతలు తీసుకొని యూనిఫాం అందించాలని నిర్ణయించింది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మంచిదైనా నేటికీ విద్యార్థులకు యూనిఫాంలు అందకపోవటంతో పాత దుస్తులతోనే పాఠశాలకు వెళ్లాల్సి వస్తోందని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. అంతేకాక పాఠ్యపుస్తకాలు సైతం మూడురోజుల కిందటే ఇచ్చినట్లు సమాచారం. దసరాకు ముందే విద్యార్థులకు దుస్తులు, కాస్మెటిక్ చార్జీలు అందించాలని తల్లిదండ్రులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

# చనిపోతున్నానంటూ భర్త వాట్సాప్ మెసేజ్

● అదే చెరువులో దూకి భార్య ఆత్మహత్యాయత్నం



బర్ల సురేందర్

బీబీనగర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): భర్త ఆత్మహత్యాయత్నాన్ని భరించలేని భార్య అదే చెరువులో దూకి ఆత్మహత్యాయత్నం చేసింది. శుక్రవారం యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండల కేంద్రంలో ఈ ఘటన జరిగింది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం రాంనగర్ గ్రామానికి చెందిన బర్ల సురేందర్ (36) హైదరాబాద్ రామంతాపూర్‌లోని ప్రగతినగర్‌లో నివాసం ఉంటూ ఐసీఐసీఐ బ్యాంకు హైటెక్ సిటీ మాదాపూర్ బ్రాంచిలో అసిస్టెంట్ మేనేజర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. వారం రోజులుగా తీవ్ర మానసిక క్షోభకు గురవుతున్న సురేందర్ ప్రవర్తనను గమనించిన భార్య సంధ్యారాణి ఇదే విషయాన్ని ఇతర కుటుంబ సభ్యులకు తెలిపింది. దీంతో సురేందర్ కుటుంబాన్ని సోదరి లత గురువారం అంబర్‌పేటలోని తన ఇంటికి తీసుకవెళ్లింది. ఇంతలా బాధపడడానికి ఏమైనా అప్పులు ఉన్నాయా? మరేదైనా కారణం ఉందా? చెప్పాలని కోరింది. అన్ని సమస్యలనూ పరిష్కరిస్తానని అక్క ధైర్యం చెప్పింది. అయినప్పటికీ అలాంటిదేమీ లేదని, ఎందుకో బతకాలని లేదు.. చనిపోవాలని ఉందని సురేందర్ చెప్పడంతో అందరూ విస్తుపోయారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం ఆఫీస్‌కు వెళుతున్నానని చెప్పి సురేందర్ ఆఫీస్‌కు వెళ్లకుండా ఊబర్‌ను బుక్ చేసుకుని బీబీనగర్ చెరువు కట్టపైకి చేరుకున్నాడు. కారును వెనుకకు తిప్పి పంపాడు. తాను చనిపోతున్నానని కుటుంబ సభ్యులకు వాట్సాప్ ద్వారా వాయిస్ మెసేజ్ పంపించాడు. హుటాహుటిన అక్కడికి వెళ్లిన కుటుంబ సభ్యులకు చెరువు కట్టపై షూ విప్పి అందులోనే మొబైల్ ఫోన్ ఉంచటంతో చెరువులోకి దూకి ఆత్మహత్య చేసుకుని ఉంటాడని అక్కడి ఆనవాళ్ల ద్వారా గుర్తించారు. కుటుంబ సభ్యులు డయల్ 100కు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో స్థానిక పోలీసులు, అధికారులు అప్రమత్తమై ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బందిని రప్పించి చెరువులో గాలింపు చర్యలు చేపట్టారు. ఓ వైపు గాలింపు కొనసాగిస్తుండగా భార్య సంధ్యారాణి భర్త లేని లోటును జీర్ణించుకోలేక తను చెరువులోకి దూకి ఆత్మహత్యాయత్నం చేసింది. అప్రమత్తమైన ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది చెరువులోకి దూకి ఆమె ప్రాణాలను కాపాడి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ప్రభాకర్ రెడ్డి తెలిపారు.

### ప్లీజ్ మమ్మీ.. నువ్వు చచ్చిపోతే నాకెవరుంటారు..

అప్పటి వరకు తన పక్కనే కూర్చున్న తల్లి సంధ్యారాణి పరుగెత్తుకుంటూ వెళ్లి చెరువులోకి దూకడంతో కళ్లారా చూసిన ఐదేళ్ల కుమారుడు సాకేత్ తట్టుకోలేకపోయాడు. నీటిలో మునిగిపోతున్న తల్లిని చూసి గుండెలవిసేలా రోధించాడు. పోలీసులు తల్లిని రక్షించి గట్టుపైకి తీసుకురాగానే తల్లి దగ్గరకు పరుగెత్తుకుంటూ వెళ్లి గుండెలకు హత్తుకుని మమ్మీ... నువ్వు చచ్చిపోవద్దు ... నువ్వు అంటే నాకు చాలా ఇష్టం .. నువ్వు చచ్చిపోతే నాకు ఎవ్వరు ఉంటారమ్మా అంటూ రోదించిన తీరును అక్కడున్న వారందరిని కలిచివేసింది. నీ కోసం బతుకుతానని చావనని కుమారుడికి హామీ ఇచ్చింది. అనంతరం విధుల్లో ఉన్న పోలీసులు సంధ్యారాణికి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈఘటన పై కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ప్రభాకర్ రెడ్డి తెలిపారు.



చావొద్దని అమ్మను బతిమిలాడుతున్న కుమారుడు సాకేత్

## ఇళ్లలో చోరీకి పాల్పడిన అంతర్రాష్ట్ర దొంగలు అరెస్ట్



స్వాధీనం చేసుకున్న కారుతో పాటు నిందితులతో పోలీసులు

హుజూర్‌నగర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలం గోపాలపురం గ్రామంలోని పేరూరి భాగ్యరాజు నివాసంలో జరిగిన చోరీ కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ బండి మోహన్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో నిందితుల వివరాలను ఆయన వెల్లడించారు. 20 రోజుల కిందట గోపాలపురంలో భాగ్యరాజు ఇంట్లో చోరీ జరిగింది. ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు జిల్లా శనివారపేట మండలం దొండపాడు గ్రామానికి చెందిన బూలసార గంగశివసాయియుగంధర్ అలియాస్ సాయి, అదేవిధంగా కాకినాడ జిల్లా ఇంద్రపాలెం గ్రామానికి చెందిన మూసీనద గౌరీమల్లేశ్వరితో పాటు మరో ముగ్గురు వ్యక్తులు కలిసి చోరీకి పాల్పడ్డారు. కాగా శుక్రవారం కోదాడ ప్రాంతంలో సాయి, గౌరీమల్లేశ్వరీలు సంచరిస్తున్నట్లు సమాచారం తెలుసుకుని పట్టుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. వారి వద్ద నుంచి కారు స్వాధీనం చేసుకుని అరెస్ట్‌చేసి కోర్టుకు రిమాండ్ తరలించామన్నారు. ఈ చోరీలో పాల్గొన్న మరో ముగ్గురిని త్వరలో పట్టుకుంటామన్నారు. ఇదిలా ఉండగా ఆగస్టు 17న గరిడేపల్లి మండలం ఎల్‌బీనగర్‌లో చోరీ చేసి అదేరోజు రాత్రి గోపాలపురంలోని భాగ్యరాజు నివాసంలో చోరీ చేసినట్లు గుర్తించామన్నారు. నిందితులు ఎక్కడెక్కడ చోరీ చేశారో గుర్తిస్తున్నామన్నారు. ఈ కేసుపై మరింత లోతుగా విచారణ చేస్తున్నామన్నారు.

## ఆర్థిక ఇబ్బందులతో బలవన్మరణం

చిట్యాల రూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామంలో జరిగింది. ఎస్‌ఐ మామిడి రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం యాదాద్రిభువనగిరి జిల్లా రామన్నపేటకు చెందిన పెద్దబోయిన రాజు(42) దినసరి కూలీ పనిచేసుకుంటూ జీవనాన్ని కొనసాగిస్తున్నాడు. పనులు లేకపోవడంతో భార్య పుట్టినిల్లు చిట్యాల మండలంలోని పెద్దకాపర్తికి వచ్చి సుమారు మూడు మాసాలుగా ఇక్కడే అద్దె ఇంట్లో ఉంటున్నారు. ఎలాంటి పనులు దొరక్క, ఏం చేయకపోవడం, కుటుంబ అవసరాల రీత్యా అప్పులు చేశాడు. మద్యానికి బానిసై అప్పులు తీర్చే మార్గం లేకపోవడంతో లోలోన మదనపడుతుండేవాడు. జీవితంపై విరక్తి చెందిన తాను అద్దెకుంటున్న నివాసంలో ఎవరూలేని సమయంలో ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఇంటికి వచ్చిన భార్య గమనించి స్థానికుల సహాయంతో పోలీసులకు సమాచారమిచ్చింది. రాజుకు భార్యతో పాటు కుమారుడు ఉన్నారు. భార్య జయమ్మ ఫిర్యాదుమేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

## ఘట్‌కేసర్‌లో శాంతినగర్ విద్యార్థిని

ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : డిప్లొమా సెకండ్‌ఇయర్ చదువుతున్న ఓ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. కళాశాల సిబ్బంది, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల శాంతినగర్‌కు చెందిన విద్యార్థిని తులసీ(17) ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలోని మెగా ఇంజనీరింగ్ కళాశాలలో డిప్లొమా సీఎస్‌సీ సెకండ్‌ఇయర్ చదువుతోంది. శుక్రవారం భోజనం విరామం తరువాత హాస్టల్ గదికి వెళ్లి తరగతిలోకి తిరిగి రాలేదు. సాయంత్రం నాలుగు గంటల తరువాత తోటి విద్యార్థినులు హాస్టల్ గదికి వెళ్లి చూడగా లోపలి నుంచి గడియపెట్టి ఉంది. కిటికిలో నుంచి చూడగా తులసీ ఉరివేసుకుని ఉండటం గమనించారు. కళాశాల సిబ్బంది, విద్యార్థినులు తలుపులు పగులగొట్టి ఘట్‌కేసర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే విద్యార్థిని మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. విషయం తెలుసుకున్న పోలీసులు కుటుంబీలకు సమాచారం అందించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదని పోలీసులు తెలిపారు.

## చికిత్స పొందుతూ మహిళ...



దస్నీ(ఫైల్)

అడవిదేవులపల్లి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : యూరియా కోసం లైన్‌లో నిలబడి గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహిళ మృతి చెందింది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా అడవిదేవులపల్లిలో శుక్రవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. యూరియా పంపిణీకి టోకెన్లు ఇస్తున్నారన్న సమాచారంతో ఈ నెల 11న మండల కేంద్రంలోని రైతువేదిక వద్దకు రైతులు బారీగా తరలివచ్చారు. ఈ క్రమంలో క్యూలైన్లలో నిల్చున్న రైతుల మధ్య తోపులాట జరిగింది. ఇందులో గోన్యాతండాకు చెందిన పాతులోతు దస్నీ(55) అనే మహిళ కిందపడటంతో కాలుకు తీవ్రగాయాలయ్యాయి. గమనించిన రైతులు వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం నల్లగొండలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ దస్నీ శుక్రవారం మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. దస్నీకి భర్త, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

## ఫిట్స్‌తో వలస కార్మికుడు

చౌటుప్పల్ రూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఫిట్స్‌తో ఓ వలస కార్మికుడు మృతి చెందాడు. యాదాద్రిభువనగిరి జిల్లా సీఐ మన్మధకుమార్ తెలిపిన వివరాల ప్రకారం బీహార్ రాష్ట్రానికి చెందిన ఓపీ రాజవంశీ(37) స్థానికంగా కూలి పనిచేస్తూ చౌటుప్పల్ మండలం ఎస్ లింగోటంలో భార్య, ముగ్గురు కుమార్తెలో కలిసి ఉంటున్నాడు. గురువారం సాయంత్రం ఓ ఇంటి నిర్మాణ పనిచేస్తుండగా ఫిట్స్ వచ్చి కిందపడిపోయాడు. చేతిలో తాళం చేతులు పెట్టగానే లేచాడు. మళ్లీ 30 నిమిషాల తర్వాత ఫిట్స్ వచ్చి పడిపోయాడు. తాళం చెవిపెట్టినా లేవకపోవడంతో 108 అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. భార్య నిర్మలదేవి ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

## మహిళ అదృశ్యంపై కేసు నమోదు



లక్ష్మమ్మ

తిరుమలగిరి(సాగర్), సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మహిళ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్) ఎస్‌ఐ వీరశేఖర్ తెలిపారు. మండలం ఎల్లాపురం గ్రామానికి చెందిన కడగోజు లక్ష్మమ్మ ఈ నెల 12న ఉదయం ఆరోగ్యం బాగాలేదని గుర్రంపోడులోని దేవుడిగుడికి అని చెప్పి వెళ్లింది. అయితే ఆమె ఇంటికి తిరిగిరాకపోవడంతో కుటుంబీకులు పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆమె కుమారుడు సైదాచారి శుక్రవారం ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. మహిళకు సంబంధించిన ఆచూకీ ఎవరికైనా తెలిస్తే 8712670199, 8712675444 నెంబర్లకు సమాచారం అందించాలని కోరారు.



## శాంభవీదేవికి పూజలు, అభిషేకాలు

చిట్యాలరూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): బాద్రపదమాసం శుక్రవారం సందర్భంగా నల్లగొండ జిల్లా చిట్యాల మండలం నేరడ గ్రామంలోని శ్రీమహమ్మాయి శాంభవీ దేవీ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేకపూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అమ్మవారికి నల్లగొండకు చెందిన వ్యక్తి పట్టుచీరు అందజేయగా పురోహితులు అలంకరించారు. అనంతరం భక్తులకు తీర్థద ప్రసాదాలును అందజేశారు.

# స్కూల్ బస్సు కింద పడి బాలుడి మృతి





పాఠశాలలో విచారణ చేపడుతున్న డీఈవో భిక్షపతి, ఎంవీఐ అధికారులు, గౌతమ్(ఫైల్‌ఫొటో)

పెద్దవూర, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ పాఠశాల బస్సు కింద పడి బాలుడు మృతి చెందాడు. గురువారం నల్లగొండ జిల్లా పెద్దవూర మండల కేంద్రంలో ఈ ఘటన జరిగింది. ఎస్‌ఐ వైప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూలు జిల్లా పెద్దకబూరు మండలం కంబాలదిన్నె గ్రామానికి చెందిన కుమ్మరి చంద్రశేఖర్ ఆరు నెలలుగా భార్య, ఇద్దరు కుమారులతో కలిసి పెద్దవూరలోని రంగప్పకాలనీలో నివాసముంటూ కిరాణ నడుపుకుంటూ జీవిస్తున్నాడు. చంద్రశేఖర్ పెద్దకుమారుడు గౌతమ్ చక్రశాలి(7) పెద్దవూరలోని శాంతినికేతన్ పాఠశాలలో ఎల్‌కేజీ చదువుతున్నాడు. గురువారం గౌతమ్ చక్రశాలి స్కూల్‌కు వెళ్లేందుకు ఉదయం రోడ్డు దాటుతుండగా తను చదువుతున్న శాంతినికేతన్ స్కూల్ బస్సు డ్రైవర్ భాషిపాక అశోక్ నిర్లక్ష్యంగా, అజాగ్రత్తతో గౌతమ్‌ను ఢీకొట్టాడు. దీంతో గౌతమ్ రోడ్డుపై పడిపోగా బస్సు ముందు చక్రం అతడి పైనుంచి వెళ్లడంతో తీవ్రగాయాలయ్యాయి. బాలుడిని నాగార్జునసాగర్ కమలానెహ్రూ ఆస్పత్రికి తరలించి అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం నల్లగొండలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి, నార్కట్‌పల్లి కామినేని ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మధ్యాహ్నం 1.45గంటల సమయంలో మృతిచెందాడు. గౌతమ్ తండ్రి చంద్రశేఖర్ శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, డ్రైవర్ అశోక్‌పై కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్‌ఐ తెలిపారు. విద్యార్థి కుటుంబానికి తగిన న్యాయం చేయాలని కుటుంబసభ్యులు, విద్యార్థి సంఘాల నాయకులు పాఠశాల ఎదుట ధర్నా నిర్వహించారు.

### చర్యలు తీసుకుంటాం : భిక్షపతి, డీఈవో, నల్లగొండ జిల్లా

శాంతినికేతన్ పాఠశాల స్కూల్ బస్సు కింద పడి బాలుడు కుమ్మరి గౌతమ్ చక్రశాలి మృతి చెందిన ఘటనపై విచారణ చేసి, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని డీఈవో బొల్లారం భిక్షపతి అన్నారు. శుక్రవారం ఆయన మండలకేంద్రంలోని పాఠశాలకు చేరుకొని విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విచారణ నిమిత్తం తదుపరి కలెక్టర్‌కు నివేదించి బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. విచారణలో జిల్లా అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఉషశ్రీ, ఎంఈవో తరి రాము తదితరులు పాల్గొన్నారు.

### సైకిల్‌పై వెళ్తుండగా వృద్ధుడు...

యాదగిరిగుట్ట రూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట గుట్ట మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి చెందాడు. సీఐ బొడ్డుపల్లి భాస్కర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మాసాయిపేట గ్రామానికి చెందిన వాసిగిరెడ్డి హనుమంతరెడ్డి(65) గురువారం రాత్రి ఎనిమిది గంటల ప్రాంతంలో సైకిల్‌పై రోడ్డు దాటుతున్నాడు. అదే సమయంలో పట్టణానికి చెందిన కన్నయ్య తన కారులో గుట్టకు వస్తూ సైకిల్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో హనుమంతరెడ్డి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు చేయలేదని సీఐ తెలిపారు.



ఇంటి వద్ద ఉన్న విద్యార్థితో మాట్లాడుతున్న ఉపాధ్యాయుడు

## బడికి ఎందుకు రాలేదు?

విద్యార్థుల ఇంటికి వెళ్లి తెలుసుకుంటున్న ఉపాధ్యాయులు

నార్కట్‌పల్లి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): బడికి రాని విద్యార్థులకు ఉపాధ్యాయులు వారికి గైర్హాజరు వేస్తారు, లేదా రోజూ రావాలంటూ హెచ్చరించి చూస్తారు. కానీ నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం ఎల్లారెడ్డిగూడెం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు హిమజ, ఉపాధ్యాయులు మూడురోజులుగా బడికి రాని విద్యార్థుల ఇంటికి వెళ్తున్నారు. ఎందుకు గైర్హాజరయ్యారో తెలుసుకుంటున్నారు. గైర్హాజరయ్యే వారిలో పదవ తరగతి చదివే విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. బడికి రాకపోవడానికి చెప్పే కారణాలు నిజమేనా కాదా అని ఆరా తీస్తున్నారు. కారణాలు సరికాదనుకుంటే తల్లిదండ్రులకు చెప్పి విద్యార్థులను ద్విచక్రవాహనంపై బడికి తీసుకెళ్తున్నారు. అకారణంగా డుమ్మా కొట్టకుండా బడికి పంపే బాధ్యత మీదని తల్లిదండ్రులకు సూచిస్తున్నారు. ఉపాధ్యాయుల పనితీరును గ్రామస్థులు అభినందిస్తున్నారు.





చెట్టు విలువ తెలిపేలా ఉన్న ఈ దృశ్యం యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ ప్రభుత్వ పాఠశాల మైదానంలోనిది. 69వ ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఎండనుంచి ఉపశమనం పొందుతూ క్రీడాకారులు, స్థానికులు చెట్ల నీడలో ఆసక్తిగా తిలకించారు.

## ఆండాళ్ అమ్మవారికి ఊంజల్ సేవోత్సవాలు



అద్దాల మండపంలో ఊంజల్ సేవోత్సవం నిర్వహిస్తున్న పూజారులు

యాదగిరిగుట్ట, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామివారి సన్నిధిలో శుక్రవారం స్వామివారికి స్వర్ణపుష్పార్చన, అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం వైభవంగా నిర్వహించారు. ప్రాకార మండపంలో హోమం, నిత్యకల్యాణం సంప్రదాయరీతిలో కొనసాగాయి. సాయంత్రం ప్రధానాలయంలో కొలువుదీరిన ఆండాళ్ అమ్మవారికి పట్టు వస్త్రాలు, ముత్యాలు, బంగారు ఆభరణాలతో దివ్యమనోహరంగా అలంకరించి సేవలో తీర్చిదిద్దారు. అమ్మవారి సేవను ఆలయ తిరువీధుల్లో ఊరేగించిన అర్చకులు ప్రాకార మండపంలోని అద్దాల మండపం ఊయలలో అధిష్టింపజేశారు. అర్చకుల వేదమంత్ర పఠనాలు, ఆస్థాన విద్వాంసుల మంగళవాయిద్యాలు, మహిళా భక్తుల మంగళ నీరాజనాల మధ్య ఊంజల్ సేవోత్సవం నేత్రపర్వంగా సాగింది. పాతగుట్ట ఆలయంలో నిత్య పూజలు సంప్రదాయ రీతిలో కొనసాగాయి. శివాలయంలో పర్వతవర్ధిని శ్రీ రామలింగేశ్వరస్వామి వారికి నిత్య పూజలు, యాగశాలలో చండీహోమం శైవాగమ పద్ధతిలో చేపట్టారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల నుంచి రూ.12,20,364 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఎస్. వెంకట్రావు తెలిపారు. నీతిఆయోగ్ విద్య, నైపుణ్యత సభ్యుడు ఐ.వి సుబ్బారావు (రిటైర్డ్ ఐఏఎస్) కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు. గర్భాలయంలోని స్వయంభువులకు ప్రత్యేక పూజలు చేశారు. వేద మండపంలో పండితులు వేద ఆశీర్వచనం చేయగా అధికారులు లడ్డు ప్రసాదాలు అందజేశారు. స్వామివారికొండపై అనువంశిక ధర్మకర్త నరసింహమూర్తిని ఆయన జన్మదినోత్సవం సందర్భంగా ఆలయ ఈవో వెంకట్రావు, డీఈవో దోర్బల భాస్కరశర్మ, ఏఈవో గజ్వేల్లి రఘు, పర్యవేక్షకులు, దేవస్థాన వర్తక సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు.

## మట్టపల్లిలో ప్రారంభమైన పవిత్రోత్సవాలు

మఠంపల్లి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మట్టపల్లి మహాక్షేత్రంలో శ్రీ రాజ్యలక్ష్మీ, చెంచులక్ష్మీ భక్త ప్రహ్లాద సహిత యోగానంద శ్రీలక్ష్మీనృసింహుని ఆలయంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న పవిత్రోత్సవాలు శుక్రవారం రాత్రి ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయంలో అఖండ దీపారాధన నిర్వహించారు. వాస్తు హోమాలు, పంచగవ్యారాధనలు నిర్వహించిన తర్వాత క్షీర గుణాధివాస ప్రోక్షణ చేపట్టారు. శయనాధివాసం, అగ్ని ప్రతిష్ఠాపన తదుపరి మహాశాంతి హోమంతో మొదటి రోజు కార్యక్రమాలు ముగిశాయి. రుత్వికులు, అర్చకులు చతుర్వేద పారాయణం, ఇతిహాస పురాణాలు పఠించారు. ఏడాది పొడవునా శ్రీస్వామి సన్నిధిలో నిర్వహించే అర్చనాదులు, ఇతర సేవల్లో జరిగే దోష పరిహారార్థం ఈ పవిత్రోత్సవాలను నిర్వహిస్తామని యాజ్ఞికులు బుర్రా వాసుదేవాచార్యులు తెలిపారు. తమిళనాడు రాష్ట్రంలోని శ్రీస్వాతీనక్షత్ర మహాయజ్ఞ వాటిక ట్రస్ట్ చైర్మన్ ముక్కూరు శ్రీనివాసన్ పంపిన పవిత్రాలను ఇక్కడి యాగ మండపంలో నుంచి ధర్మకర్తలు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, దేవస్థాన ఈవో సిరికొండ నవీన్ తలపై ఆలయానికి సాయంత్రం చేర్చారు. ఈ కార్యక్రమంలో అర్చకులు తూమాటి రామాచార్యులు, తూమాటి శ్రీనివాసాచార్యులు, తూమాటి కృష్ణమాచార్యులు, అద్దేపల్లి లక్ష్మణాచార్యులు, పద్మనాభాచార్యులు, బ్రహ్మాచార్యులు, బద్రీనారాయణచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి ఆలయ అర్చకులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడి



వరి పొలాన్ని పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు శ్రీధర్, రాములమ్మ

మద్దిరాల, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): రైతులకు పరిశోధన కేంద్రంలో అభివృద్ధి చేసిన నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడి వస్తుందని శాస్త్రవేత్తలు శ్రీధర్, ఎ.రాములమ్మ అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన శాస్త్రవేత్తలు శుక్రవారం మద్దిరాల మండలంలో చిననెమిల, ముకుందాపురం, రెడ్డిగూడెం గ్రామాల్లో పర్యటించారు. పరిశోధన కేంద్రంలో అభివృద్ధి చేసిన నాణ్యమైన వరి, పెసర విత్తనాలను సరఫరా చేసి విత్తనోత్పత్తిని ప్రోత్సహించేందుకు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రతీ రెవెన్యూ గ్రామంలో ముగ్గురు రైతుల పొలాల్లో నాటిన పంటలను పరిశీలించారు. వరి కేఎన్ఎం 1638 పంటలో ఆకునల్లి, సుడిదోమ ఉధృతి గమనించినట్లు తెలిపారు. నివారణకు స్పైరో మెసిఫెన్ ఒక మిల్లీమీటర్ లీటరు నీటికి చొప్పున పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏవో అనిషారోహి, ఏఈవో మనోహర్, రైతులు పాల్గొన్నారు.

## బెల్లి జనార్దన్‌కు ఎన్టీఆర్ నేషనల్ అవార్డు



అవార్డుతో జనార్దన్

నకిరేకల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): నకిరేకల్ మండలం పాలెం గ్రామానికి చెందిన మాజీ సైనికుడు, నటుడు, నిర్మాత బెల్లి జనార్ధన్‌కు నందమూరి తారకరామారావు నేషనల్ అవార్డు 2025ను అందజేశారు. విజయవాడలో గురువారం న్యాకంబాల శివలీల ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మదర్ సర్వీస్ సొసైటీ డాక్టర్ మల్లాది ప్రసాద్ ఆధ్వర్యంలో ఆయనకు ఎన్టీఆర్ నేషనల్ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా జనార్ధన్ మాట్లాడుతూ ఎన్టీఆర్ అవార్డును అందుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు.

# గంజాయి వయా సూర్యాపేట

- ఏపీ, చత్తీస్‌ఘడ్, ఒడిశా రాష్ట్రాల నుంచి గంజాయి సరఫరా
- సరిహద్దు జిల్లా కావడంతో వివిధ మార్గాల్లో జిల్లాలోకి
- మూడేళ్లలో 655 కిలోల గంజాయి స్వాధీనం

సూర్యాపేట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లాలో గంజాయి రవాణా, విక్రయాలు కొందరికి వృత్తిగా మారాయి. జిల్లాలోని ప్రధాన పట్టణాలైన సూర్యాపేట, తిరుమలగిరి, కోదాడ, హుజూర్‌నగర్, నేరేడుచర్లతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోనూ గంజాయి లభిస్తోంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సరిహద్దులో ఉన్న అరకు ప్రాంతంతో పాటు ఒడిశా, చత్తీస్‌ఘడ్ రాష్ట్రాల నుంచి నుంచి గంజాయిని కొనుగోలు చేసి కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు. ఇందుకు సరిహద్దులో ఉన్న సూర్యాపేట జిల్లాను అనుకూలంగా మార్చుకుంటున్నారు. ఈ ప్రాంతం మీదుగానే హైదరాబాద్, బెంగళూరు, ముంబాయి వంటి ప్రాంతాలకు తరలిస్తున్నారు. రాష్ట్ర సరిహద్దులోని కోదాడ మండలం నల్లబండగూడెం వద్ద పోలీసు తనిఖీల్లో తరుచూ గంజాయి పట్టుబడటంతో నిందితులను జైలుకు తరలిస్తున్నారు. దీంతో గంజాయిని తరలించేందుకు గంజాయి ముఠా వినూత్న, ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకుంటోంది. ఇలా కారుల్లో ప్రత్యేకంగా ఐరన్ అరలు(ర్యాక్‌లు) అమర్చి కూడా గంజాయిని తరలిస్తుండగా పోలీసులకు పట్టుకున్నారు. అయితే ఎన్నిచర్యలు తీసుకుంటున్నా గంజాయి రవాణా మాత్రం ఆగడంలేదు.



సూర్యాపేట జిల్లా పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి(ఫైల్)

### మూడేళ్లలో 655 కిలోల గంజాయి పట్టివేత

సూర్యాపేట జిల్లాలో మూడేళ్ల వ్యవధిలో 655.8కిలోల గంజాయిని స్వాధీనం చేసుకోగా, 63కేసులు నమోదుచేసి 166మందిని అరెస్టు చేశారు. గంజాయి తాగిన వారికి 90 రోజుల రిమాండ్ విధిస్తున్నా బెయిల్‌పై బయటికి వస్తున్నారు. జిల్లాలో గంజాయికి బానిసలైన వారికి హైదరాబాద్‌లోని చంచల్‌గూడ జైలులోని డీ-అడిక్షన్ సెంటర్‌లో చికిత్స అందిస్తున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి ఈ నెల 17వ తేదీ వరకు 117 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 16కేసులు నమోదు చేయగా 47మంది వ్యక్తులను అరెస్టు చేశారు. గతేడాది 20 కేసులు నమోదు కాగా 24.15 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని 49 మందిని అరెస్టు చేశారు. 2023లో 631.65 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని 27 కేసులు నమోదు చేసి 70మందిని రిమాండ్‌కు తరలించారు. అంతేకాక గంజాయి రవాణాకు పాల్పడిన ముగ్గురిపై పీడీ యాక్టు కేసు నమోదు చేశారు.

### దారి మారుస్తూ..

రాష్ట్ర సరిహద్దుగా ఉన్న కోదాడ మండలం నల్లబండగూడెం వద్ద చెక్‌పోస్టు ఏర్పాటుచేసి తనిఖీలు ముమ్మరం చేయడంతో ప్రత్యామ్నాయ మార్గాలను గంజాయి ముఠా ఉపయోగిస్తోంది. ఇందుకోసం ప్రధాన రహదారుల్లో కాకుండా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఎన్టీఆర్ జిల్లా నుంచి జగ్గయ్యపేట, ముక్త్యాల, మేళ్లచెర్వు, దొండపాడు, హుజూర్‌నగర్ నుంచి హైదరాబాద్‌కు చేర్చుతున్నారు. ఈ క్రమంలోనే హుజూర్‌నగర్‌లో ఇటీవల గంజాయి తరలించే వాహనాన్ని పట్టుకున్నారు.

### బానిసలవుతున్న యువకులు

గంజాయి పీల్చేందుకు అలవాటుపడిన యువతపై అది తీవ్ర ప్రభావం చూపిస్తోంది. ఒకసారి అలవాటుపడిన యువకులకు అది తీసుకోకుంటే ఏమీ తోచని పరిస్థితి ఉంటోంది. ప్రతీ రోజూ తాగాలనిపించడం, తాగకపోతే ఆలోచనలు పనిచేయడం లేదన్న ధోరణిలో యువత ఉంటోంది. జిల్లాలో ఈ మత్తుఉచ్చులో ఎక్కువగా 25ఏళ్లలోపు యువకులు ఉన్నారు. గంజాయి తాగడం కోసం తల్లిదండ్రులపై దాడులకు దిగుతున్నారు. గంజాయి మత్తులో ఎక్కువ మంది ఆటో డ్రైవర్లు, డీజే నిర్వాహకులు, రోజువారి కూలీలతో పాటు కొంత మంది విద్యార్థులు కూడా ఉన్నారు. గంజాయి మైకంలో నేరాలకు పాల్పడుతున్నారు.

### డబ్బు సంపాదన కోసం వృత్తిగా చేసుకుని

గంజాయిని సేవించడంతో పాటు విక్రయించడాన్ని యువకులు వృత్తిగా మలుచుకుంటున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అరకు, సీలేరు, ఒడిశా, చత్తీస్‌ఘడ్ రాష్ట్రాల నుంచి గంజాయిని తరలిస్తున్నారు. ఇతర రాష్ట్రాల్లో కిలో గంజాయి విలువ రూ.10 వేల నుంచి రూ.20వేల వరకు ఉంటోంది. కొనుగోలు చేసిన గంజాయిని ప్యాకెట్లలోకి మారుస్తున్నారు. ఒక్కొక్క ప్యాకెట్‌ను రూ.100నుంచి రూ.500వరకు విక్రయిస్తుంటారు. తాజాగా ఈ ఏడాది జూలై 3వ తేదీన సూర్యాపేట జిల్లా కేంద్రంలో సీసీఎస్, పట్టణ పోలీస్‌లు గంజాయి తరలిస్తున్న ఆరుగురు యువకులను పట్టుకున్నారు. వీరు గంజాయిని తక్కువ ధరకు తెచ్చి ఎక్కువకు విక్రయిస్తుంటారు. జిల్లా కేంద్రంలోని చంద్రన్నకుంటతో పాటు సీతారాంపురం, రాజీవ్‌నగర్, భగత్‌సింగ్‌నగర్, అంబేడ్కర్‌నగర్, కుడకుడతో పాటు శివారు ప్రాంతాల్లో విక్రయాలు చేస్తున్నారు. పట్టుబడిన వారందరూ అవివాహితులే కావటం గమనార్హం.

### గంజాయి రహిత జిల్లాగా మార్చేందుకు కృషి



సూర్యాపేట జిల్లాను గంజాయి రహితంగా మార్చేందుకు కృషి చేస్తున్నామని జిల్లా ఎస్పీ కొత్తపల్లి నర్సింహ అన్నారు. గంజాయి కేసులో అరెస్టు అయి శిక్షలు పడి తిరిగి వచ్చిన వారిపై నిఘా పెడుతున్నట్లు తెలిపా రు. ప్రస్తుతం ప్యాకెట్ల రూపంలో తెచ్చి విక్రయిస్తున్నారని ఎక్కడైనా విక్రయాలు జరుగుతున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచిస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపుతామన్నారు.

– కె.నర్సింహ, ఎస్పీ, సూర్యాపేట జిల్లా

# తప్పని యూరియా కష్టాలు

- యూరియా కోసం రైతుల పడిగాపులు
- పీఏసీఎస్‌ల ఎదుట బారులు



నాంపల్లిలో యూరియా కోసం ధర్నా చేస్తున్న రైతులు

నాంపల్లి, చింతపల్లి, అర్వపల్లి, ఆత్మకూర్ (ఎస్), గుండాల, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నల్లగొండ జిల్లాలో యూరియా కష్టాలు తొలగడం లేదు. పలు మండలాల్లో యూరియా కోసం పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంది. పీఏసీఎస్ కార్యాలయాల వద్ద రైతులు యూరియా కోసం బారులు తీరారు. యూరియా కోసం నిరీక్షించినా అందకపోవడంతో నల్లగొండ జిల్లాలో ధర్నా చేపట్టగా, సూర్యాపేట జిల్లాలో రాస్తారోకో నిర్వహించారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా రైతులకు యూరియా సరఫరా చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని విమర్శించారు. సరిపడా యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

నాంపల్లి మండల కేంద్రంలోని రైతు సేవా కేంద్రం ఎదుట మండలంలోని రైతులు యూరియా కోసం బారులుతీరారు. శుక్రవారం నాంపల్లి మండల కేంద్రానికి 600 బస్తాల యూరియా సరఫరా అయింది. మండలంలోని వివిధ గ్రామాల నుంచి వెయ్యికిపైగా రైతులు ఉదయం నుంచి లైన్‌లో నిలబడ్డారు. 600మందికి యూరియా ఇవ్వడంతో మిగిలినవారు నిరుత్సాహానికి గురై అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం గోదాం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో రైతులు ధర్నా నిర్వహించారు. రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయడంలో ప్రభుత్వం విఫలమైందని సీపీఎం మండల కార్యదర్శి నాంపల్లి చంద్రమౌళి ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు, రైతులు నక్కబోయిన నర్సింహ, బండి రవి, నాగరాజు, చంద్రయ్య, వీరయ్య, వెంకటయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

● చింతపల్లి మండలకేంద్రంలోని ఆగ్రో రైతు సొసైటీ కేంద్రానికి యూరియా వచ్చిందని తెలుసుకున్న మండలంలోని పలు గ్రామాల రైతులు మార్కెట్ యార్డులో యూరియా కోసం బారులు తీరారు.

● సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెం మండలంలో అర్వపల్లి పీఏసీఎస్ కార్యాలయం వద్ద రైతులు శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి యూరియా కోసం బారులు తీరారు. ఎంతసేపటికి యూరియా రాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఉదయం 11 గంటల సమయంలో సూర్యాపేట-జనగాం రహదారిపై రెండు గంటల పాటు రైతులు రాస్తారోకో నిర్వహించారు. విషయం తెలుసుకున్న అర్వపల్లి ఎస్ఐ సైదులు సిబ్బందితో రైతులకు నచ్చజెప్పి రెండు రోజుల్లో యూరియా అందజేస్తామని చెప్పడంతో రైతులు రాస్తారోకో విరమించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీకాంత్, ఏవో గణేష్, రైతులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. ఆత్మకూరు (ఎస్)మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయం వద్ద కిలోమీటరు మేర రైతులు యూరియా టోకెన్ల కోసం బారులుతీరారు.

● యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలోని మర్రిపడగ పీఏసీఎస్ కార్యాలయం వద్ద శుక్రవారం యూరియా కోసం రైతులు బారులు తీరారు. కార్యాలయానికి వచ్చిన రైతులకు రెండు బస్తాల చొప్పున యూరియా అందజేశారు. యూరియా దొరకని రైతులకు రెండు రోజుల్లో తిరిగి యూరియా రాగానే పంపిణీ చేస్తామని అధికారులు తెలిపారు.



జాజిరెడ్డిగూడెంలో సూర్యాపేట-జనగాం రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులు

### అక్రమంగా యూరియా నిల్వ



బోట్యానాయక్‌తండాలోని రేకుల షెడ్డులో నిల్వ ఉంచిన యూరియా

మిర్యాలగూడ రూరల్: నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలంలోని గూడూరు క్యాంపు బోట్యానాయక్‌తండాలో ఓ రేకులషెడ్డులో యూరియా నిల్వ చేయడంపై శుక్రవారం పలురకాల ఆరోపణలు వెల్లువెత్తాయి. గూడూరుకు సంబంధించిన మోహన్ ఫర్టిలైజర్ దుకాణానికి 220 బస్తాల యూరియాను పంపిణీ చేశారు. సదరు యజమాని అనారోగ్య కారణాలతో గోదాములో కాకుండా బోట్యానాయక్‌తండా రైతులకు ఇవ్వాలనే ఉద్దేశ్యంతో తండాలోని తన షాపునకు చెందిన షెడ్డులో యూరియా నిల్వ చేశాడు. విషయం తెలుసుకున్న వ్యవసాయాధికారులు అక్కడికి చేరుకొని ఆ యూరియా బస్తాలను రైతులకు దగ్గరుండి విక్రయించారు. ఇదిలా ఉండగా కొందరు ఈ విషయంపై పలురకాల ఆరోపణలు చేస్తూ అధికారులను ప్రశ్నించారు. దీంతో ఫర్టిలైజర్ యజమాని నిర్లక్ష్యమని అన్నారు. అనంతరం ఏవో సైదానాయక్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

## పోచంపల్లి బ్యాంకుకు రెండు జాతీయ అవార్డులు




అవార్డులను అందుకుంటున్న పోచంపల్లి అర్బన్ బ్యాంకు చైర్మన్ తడక రమేష్, పాలకమండలి

భూదాన్‌పోచంపల్లి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): పోచంపల్లి కో- ఆపరేటివ్ అర్బన్ బ్యాం కు రెండు జాతీయ అవార్డులను గెలుచుకుందని అర్బన్ బ్యాంకు చైర్మన్ తడక రమేష్, సీఈవో సీత శ్రీనివాస్ తెలిపారు. జాతీయ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకుల సమ్మేళనాన్ని గోవాలో ముంబాయికి చెందిన బ్యాంకింగ్ ఫ్రాంటియర్స్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి పోచంపల్లి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు బెస్ట్ కో-ఆపరేటివ్ బ్యాంక్‌గా, బెస్ట్ కాంప్లియెన్స్ ట్రాన్స్‌ఫార్మేషన్ అవార్డులకు ఎంపికైంది. ఈ అవార్డులను గోవా సహకార శాఖామంత్రి సుభాష్ శిరోడ్కర్, నేషనల్ అర్బన్ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ జ్యోతీంద్రబాయ్ మెహతా అందజేశారు. ఈ సందర్భంగా అర్బన్ బ్యాంకు చైర్మన్ తడక రమేష్, సీఈవో సీత శ్రీనివాస్ మాట్లాడుతూ పోచంపల్లి అర్బన్ బ్యాంకు దినదినాభివృద్ధి చెందుతూ ఇప్పటికి 15 బ్రాంచ్‌లుగా విస్తరించిందన్నారు. త్వరలో మరో 7 బ్రాంచ్‌లు ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ భారత రాజేంద్రప్రసాద్, డైరెక్టర్లు కర్నాటి బాలసుబ్రహ్మణ్యం, ఏలె హరిశంకర్, సూరెపల్లి రమేష్, రాపోలు వేణు, గుండు కావ్య, కర్నాటి భార్గవి, కొండమడుగు ఎల్లస్వామి, బిట్టు భాస్కర్, మక్తాల నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదమని తెలిసినా



బైక్‌పై మూడు యూరియా బస్తాలు తీసుకెళ్తున్న రైతు

ద్విచక్ర వాహనంపై ఎరువుల బస్తాలు తీసుకెళ్లడం ప్రమాదకరం. బస్తాలు జారి బైక్ అదుపు తప్పి కిందపడి గాయపడే ప్రమాదముంటుంది. అయినా తప్పనిసరి పరిస్థితుల్లో ఒక బస్తా అంటే ఏదోలే అనుకోవచ్చు. కానీ యూరియా కొరత మూలంగా దొరినప్పుడే తీసుకెళ్లాలన్న తాపత్రంతో రైతులు బైక్‌పై రెండు, మూడు బస్తాలు తీసుకెళ్తున్నారు. మోత్కూరు సింగిల్‌విండో నుంచి శుక్రవారం ఓ రైతు బైక్‌పై మూడు యూరియా బస్తాలు తీసుకెళ్తూ కనిపించాడు.

(ఆంధ్రజ్యోతి - మోత్కూరు)

# నీటి లెక్కల్లో తేడాలు లేకుండా చూడాలి

- కేఆర్ఎంబీ చైర్మన్ బీపీ పాండ్యే
- సాగర్ ఎడమ కాల్వ, ప్రధాన జలవిద్యుత్ కేంద్రాల వద్ద టెలిమెట్రీల పరిశీలన

నాగార్జునసాగర్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టు నీటి విడుదల లెక్కల్లో తేడా లేకుండా చూడాలని కేఆర్ఎంబీ (కృష్ణానదీ యాజమాన్య బోర్డు) చైర్మన్ బీపీ పాండ్యే సూచించారు. రెండు రోజుల సాగర్ పర్యటనలో భాగంగా ఆయన శుక్రవారం ఉదయం నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ పరిధిలోని అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, అక్కడ టెలిమెట్రీని పరిశీలించారు. ప్రధాన డ్యాం, కుడి, ఎడమ, వరదకాల్వలు, అక్కంపల్లి రిజర్వాయర్ల వద్ద ఏర్పాటు చేసిన టెలిమెట్రీ మీటర్లలో తేడాలు లేకుండా చూడాలన్నారు. అనంతరం సాగర్ వరద, ఎడమ కాల్వ, ప్రధాన డ్యాంల వద్ద ఏర్పాటు చేసిన టెలిమెట్రీలను పరిశీలించారు. సాగర్ నుంచి దిగువకు విడుదలవుతున్న నీటి లెక్కలను, టెలిమెట్రీల్లో నమోదవుతున్న నీటి లెక్కలను పోల్చి చూశారు. నీటి విడుదల లెక్కల్లో స్వల్ప తేడాలున్నట్లు గుర్తించిన ఆయన నీటి లెక్కల్లో తేడాలు లేకుండా సరిచేయాలని సదరు ఏజెన్సీని ఆదేశించారు. ఆరు నెలలుగా టెలిమెట్రీ మీటర్ల సెన్సార్లు అప్‌డేట్ చేయకపోవడంతోనే నీటి లెక్కల్లో స్వల్ప తేడాలున్నట్లు సదరు ఏజెన్సీ సభ్యులు చైర్మన్‌కు వివరించారు. సెన్సార్లను వెంటనే అప్‌డేట్ చేసి నీటి లెక్కల్లో తేడాలు లేకుండా చూడాలని ఏజెన్సీకి చైర్మన్ సూచించారు. ఆయన వెంట కేఆర్ఎంబీ సభ్యులు కేకే జాన్‌గిడ్, శ్రీనివాస్‌రావు, ప్రాజెక్టు సీఈ అజయ్‌కుమార్, డీఎస్ఈ నాగేశ్వర్‌రావు, ఈఈ సీతారాం, డీఈ అశోక్, ఏఈలు కృష్ణయ్య, సత్యనారాయణ తదితరులున్నారు.

### సాగర్ 24 గేట్ల ద్వారా నీటి విడుదల

నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు శుక్రవారం ఉదయం ఎగువ నుంచి వరద రాక మరింత పెరిగింది. దీంతో ప్రాజెక్టు అధికారులు సాగర్ 24 క్రస్ట్ గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు (312.0450టీఎంసీలు) కాగా, ప్రస్తుతం 587.20 అడుగులు(305.6242టీఎంసీలు)గా ఉంది. సాగర్ నుంచి కుడికాల్వ ద్వారా 9,500 క్యూసెక్కుల నీటిని, ఎడమ కాల్వ ద్వారా 8,629 క్యూసెక్కులు, వరదకాల్వ ద్వారా 300 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 33,292 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. 26 క్రస్టుగేట్లల్లో 18 గేట్లను ఐదు అడుగుల మేరకు, ఆరు క్రస్ట్ గేట్లను 10 అడుగుల మేరకు ఎత్తి 2,27,256 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 2,81,377 క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా, ఎగువ నుంచి 2,78,066 క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతోంది.

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్ ప్రాజెక్టు భద్రతను టీజీ ఎస్పీఎఫ్‌కు అప్పగించాలని బీఆర్ఎస్ మాజీ కౌన్సిలర్ రమేష్‌జీ కేఆర్ఎంబీ చైర్మన్ బీపీ పాండ్యేకు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు కేఆర్ఎంబీ చైర్మన్ సానుకూలంగా స్పందించారని, పూర్తి స్థాయిలో విచారణ చేసిన తర్వాత నిర్ణయం తీసుకుంటామని తెలిపినట్లు రమేష్‌జీ తెలిపారు.



నాగార్జునసాగర్ ఎడమ కాల్వ వద్ద టెలిమెట్రీలను పరిశీలిస్తున్న కేఆర్ఎంబీ చైర్మన్ బీపీ పాండ్యే

### టెయిల్‌పాండ్‌ను పరిశీలించిన కేఆర్ఎంబీ చైర్మన్

అడవిదేవులపల్లి: మండల శివారులోని టెయిల్‌పాండ్ ప్రాజెక్టును కేఆర్ఎంబీ చైర్మన్ బీపీ.పాండే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన నాగార్జునసాగర్ నుంచి విడుదలవుతున్న జలాలు, దిగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టుకు ఎన్ని క్యూసెక్కులు విడుదల అవుతున్నాయనే విషయాలను, గేట్ల సామర్థ్యాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పవర్‌హౌస్‌కు వెళ్లి విద్యుత్ ఉత్పత్తిని పరిశీలించారు. ఆయన వెంట కమిటీ సభ్యులు కమల్, జెన్‌కో ఎస్ఈ వెంకటరమణ, శ్రీనివాసులు, ఈఈ సుబ్రహ్మణ్యం, జయశంకర్, గిరిబాబు పాల్గొన్నారు.

### నేడు కాశీవిశ్వేశ్వర స్వామికి కల్యాణం

నల్లగొండకల్చరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తులసీనగర్‌లో గల శ్రీ భక్తాంజనేయ దేవాలయంలోని శివాలయంలో శనివారం ఉదయం 6గంటలకు శివునికి రుద్రాభిషేకాలు, రాత్రి 7గంటలకు విశాలక్షి సహిత కాశీవిశ్వేశ్వరస్వామికి కల్యాణం ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో కళాశిక కుశలయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

### రాష్ట్ర స్థాయి టీఎల్ఎం మేళాకు శ్రీనివాస్ ఎంపిక



శాలిగౌరారం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం మండలం ఇటుకులపహాడ్ ప్రాథమిక పాఠశాలలో గణితం ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న అనుమాల శ్రీనివాస్ రాష్ట్రస్థాయిలో నిర్వహించే టీఎల్ఎం మేళాకు ఎంపికయ్యారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం జరిగిన టీఎల్ఎం మేళాలో ఆయన పాల్గొని గణితం సబ్జెక్టులో చేసిన ప్రదర్శన ఉత్తమ ప్రతిభ కనబర్చినందుకు రాష్ట్రస్థాయి మేళాకు ఎంపిక చేశారు.

# సాదాబైనామాలకు మోక్షం

**● సాకారం కానున్న ఏళ్ల నిరీక్షణ ● హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు**

చండూరు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): సాధారణ పేపర్లపై రాసుకుని భూములు కొనుగోలు చేసిన వారికి హక్కులు లభించనున్నాయి. భూభారతి చట్టం ద్వారా క్రమబద్ధీకరించేందుకు అధికారం కల్పిస్తూ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. దీని ప్రకారం 2020 అక్టోబరు 12నుంచి నవంబరు 10వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకున్న వారికి ఆయా భూములపై హక్కులు దక్కనున్నాయి. అయితే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ఈ ఏడాదిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన సాదాబైనామా దరఖాస్తుల్లో కొన్నింటికి హక్కులు దక్కేలా లేవు. రెవెన్యూ సదస్సులో దరఖాస్తు చేసుకున్నా 2020లో దరఖాస్తు చేసుకున్న వారికి మాత్రమే ఆయా భూములపై హక్కులను కల్పిస్తూ 13-బీ సర్టిఫికెట్లను జారీ చేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు.

**సాకారం కానున్న ఏళ్ల నిరీక్షణ**

సాదాబైనామాలతో కొనుగోలు చేసిన భూములపై హక్కుల కోసం ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న రైతులకు ఎట్టకేలకు పరిష్కారం లభించనుంది. తాజాగా ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వులతో వారందరికీ హక్కులు దక్కబోతున్నాయి. ఇన్నాళ్లు భూములు తమ ఆధీనంలోనే ఉన్నా, వ్యవసాయం చేస్తున్నా హక్కులు మాత్రం లేకుండాపోయాయి. రైతుబంధు, రైతు భరోసా వంటి పథకాలకు దరఖాస్తు చేసుకుంటే అవకాశం లేకపోవడం, పంట రుణాలు తీసుకునే అవకాశం లేకపోవడంతో వారంతా తీవ్రఆందోళనకు గురయ్యారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం సాదాబైనామాలను పరిష్కరిస్తామని చెప్పినా అమలుకు నోచుకోలేదు. ధరణిలో వాటి పరిష్కారానికి అవకాశం ఇవ్వకపోవడంతో రైతులకు ఇబ్బందులు తప్పలేదు. భూభారతి అమలులో భాగంగా వాటి క్రమబద్ధీకరణకు ఉత్తర్వులు జారీ చేయడంతో చండూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో ఆయా మండలాల్లో వేల సంఖ్యలో ఉన్న దరఖాస్తులకు మోక్షం లభించనుంది.

**డివిజన్‌లో దరఖాస్తుల వివరాలు**

డివిజన్ పరిధిలో నాంపల్లి, చండూరు, మర్రిగూడ, గట్టుప్పల, మునుగోడు మండలాలు ఉన్నాయి. మొత్తం సాదా బైనామాల దరఖాస్తుల వివరాలు ఇలా ఉన్నాయి. డివిజన్‌లో మొత్తం సాదాబైనామాల కోసం వచ్చిన దరఖాస్తులు చేసుకున్నారు. మీసేవ కేంద్రాల్లో 2006 నుంచి 2020 సంవత్సరం మధ్యలో సాదాబైనామా దరఖాస్తుల వివరాలు ఇలా ఉన్నాయి. నాంపల్లి మండలం 300, మర్రిగూడ 304, గట్టుప్పల 97, చండూరు 330, మునుగోడు 1248, డివిజన్ పరిధిలో మొత్తం 2279 దరఖాస్తులు వచ్చాయి. ఈ దరఖాస్తులకు మోక్షం లభించనుంది.

**రెవెన్యూ సదస్సుల్లో దరఖాస్తులు**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక భూభారతి చట్టాన్ని అమలుచేసింది. ఇందులో భాగంగా ఈ ఏడాది జూన్‌లో రాష్ట్ర వ్యాప్తంగా రెవెన్యూ సదస్సులు నిర్వహించింది. ఈ ఏడాది జూన్ 3 నుంచి 20వ తేదీ వరకు సదస్సులు నిర్వహించి రైతుల సమస్యలపై అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. చండూరు డివిజన్ పరిధిలో ఉన్న చండూరు మండలంలో 104, గట్టుప్పల మండలంలో 25, మర్రిగూడ మండలంలో 126, మునుగోడు మండలంలో 170, నాంపల్లి మండలంలో 16, డివిజన్ పరిధిలో మొత్తం 441 దరఖాస్తులు వచ్చాయి. ఈ సదస్సులో కొంత మంది వివిధ భూ సమస్యలపై దరఖాస్తులు చేసుకున్నారు. అందులో సాదాబైనామాలకు సంబంధించిన దరఖాస్తులు కూడా వచ్చాయి. అయితే ప్రస్తుత సాదా బైనామాల క్రమబద్ధీకరణలో ఈ దరఖాస్తులను పరిగణలోకి తీసుకోవడం కుదరదని అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం జారీ చేసిన జీవోలో స్పష్టంగా దరఖాస్తుల కటాఫ్ తేదీని ప్రకటించినందున దరఖాస్తుదారులకు హక్కులు దక్కవని అధికారులు పేర్కొంటున్నారు. ఈ దరఖాస్తులు 2020 నాటికి కటాఫ్ తేదీల్లో దరఖాస్తు చేసుకుని ఉంటే హక్కులు దక్కనున్నాయి.



పొలాలు

**ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు పరిష్కారం**



ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల మేరకే డివిజన్‌లో సాదా బైనా మాల దరఖాస్తులను పరిష్కరించనున్నాం. ప్రతీ దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి తగిన నిర్ణయాన్ని వివిధ స్థాయిలో రెవెన్యూ అధికారులు తీసుకుంటారు. 2020 అక్టోబరు 12 నుంచి నవంబరు 10వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకున్న వారికి ఆయా భూములపై హక్కులు దక్కనున్నాయి. గతంలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి విచారణ చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వ లక్ష్యం నెరవేరేలా చర్యలు తీసుకుంటాం.

\- శ్రీదేవి, చండూరు ఆర్డీవో

## పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



పట్టణంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న ఉద్యోగులు

నల్లగొండ టౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని భారత ఆహార సంస్థ నల్లగొండ డివిజనల్ మేనేజర్ సువీన్ కుమార్ అన్నారు. స్వచ్ఛతా హీ సేవలో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని భారత ఆహార సంస్థ డివిజనల్ కార్యాలయం నుంచి క్లాక్‌టవర్ సెంటర్ వరకు స్వచ్ఛ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సువీన్‌కుమార్ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతో అంటువ్యాధులు ప్రబలకుండా ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం (క్యూసీ) డాక్టర్ రాఘవేంద్రసింగ్, సీనియర్ అధికారులు కేఎన్‌కే ప్రసాద్, బిల్లా శ్రీనివాసరావు, సజిత్, రాము, నిర్వాహకులు సతీష్‌రెడ్డి పాల్గొన్నారు.

## వైభవంగా లక్ష్మీనారాయణుల కల్యాణం

నార్కట్‌పల్లి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి మండలంలోని మాండ్ర - కక్కిరేణి గ్రామాల శివారులో అనంత స్వర్ణగిరి గుట్ట వద్ద ఉన్న మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో శుక్రవారం లక్ష్మీనారాయణుల కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రతీ నెలా అమావాస్య ముందు వచ్చే త్రయోదశి రోజును కల్యాణాన్ని నిర్వహించడం ఆనవాయితీ. యాజ్ఞీకులు సత్యనారాయణశర్మ అర్చకత్వంలో జరిగిన ఈ కల్యాణోత్సవం తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ వేడుకలో దేవస్థాన నిర్మాణ దాత శ్రీరామదాసే సేవా సమితి అధ్యక్షుడు ఉండ్ర లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మునిసిపాలిటీ అభివృద్ధికి కృషి



ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీరేశం

చిట్యాల, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): చిట్యాల మునిసిపాలిటీలో అన్ని మౌలిక వసతులు కల్పిస్తూ సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే వీరేశం అన్నారు. మునిసిపాలిటీలోని పలు వార్డుల్లో శుక్రవారం నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఆయన ప్రారంభించి మట్లాడారు. పట్టణంలో అవసరం ఉన్న చోట సీసీరోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. చిట్యాలలోని బతుకమ్మకుంటను పునర్నిర్మిస్తామని, అసంపూర్తిగా ఉన్న డబుల్‌బెడ్‌రూం ఇళ్లను పూర్తిచేసి పేదలకు పంపిణీ చేస్తామని తెలిపారు. లో వోల్టేజీ సమస్య పరిష్కరించడంతో పాటు ఎలాంటి ఆటంకాలు లేకుండా విద్యుత్ సరఫరా చేయడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్మన్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పోకల దేవదాస్, చినమల్లయ్య, ఏడీఈ బాలునాయక్, ఏఈ రవీందర్‌రెడ్డి, లైన్‌మెన్ ఈశ్వర్, నాయకులు ఎద్దులపురి కృష్ణ, ఆంజనేయులు, పరమేశం తదితరులు పాల్గొన్నారు.

## కాసనగోడులో కంటి వైద్యశిబిరం

కేతేపల్లి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాసనగోడు గ్రామంలో సూర్యాపేట లయన్స్ కంటి ఆసుపత్రి సహకారంతో నకిరేకల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన కంటి వైద్య శిబిరాన్ని లయన్స్ క్లబ్ నకిరేకల్ అధ్యక్షుడు రేపాల సతీష్ ప్రారంభించి మాట్లాడారు. శిబిరంలో సూర్యాపేట లయన్స్ కంటి ఆసుపత్రి వైద్యులు కాసనగోడు, బొప్పారం గ్రామాలకు చెందిన 70మందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. మరో 10మందికి కంటి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించి వారిని సూర్యాపేట లయన్స్ కంటి ఆసుపత్రికి తరలించారు. కార్యక్రమంలో నకిరేకల్ లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు కందాల పాపిరెడ్డి, క్లబ్ కార్యదర్శి సూర్యచంద్రరరావు, క్లబ్ ప్రతినిధులు అండెం వెంకన్న, కందాల నారాయణరెడ్డి, టి.ప్రభాకర్‌రావు, డి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## భక్తులకు అల్పాహారం అందజేత

కనగల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల రేణుకా ఎల్లమ్మ ఆలయం వద్ద భక్తులకు శుక్రవారం న్యాకంబాల శివలీల ఫౌండేషన్ ఆధ్వర్యంలో భక్తులకు అల్పాహారం అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షురాలు శివలీలారెడ్డి, బచ్చనగోని కిరణ్, మనీష, శివమ్మ, ఇంద్రాని తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : అమిత్‌రెడ్డి



పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి మాట్లాడుతున్న గుత్తా అమిత్‌రెడ్డి

చిట్యాలరూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని డెయిరీ డెవలప్‌మెంట్ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి అన్నారు. చిట్యాల మండలం ఉరుమడ్ల గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. శుక్రవారం గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో వారికి అమిత్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అమిత్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నడూ లేని విధంగా గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని, సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు అందుతున్నాయని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. పార్టీలో చేరిన వారిలో కోనేటి ఎల్లయ్య, కోనేటి నర్సింహ, కోనేటి నాగయ్య, జన్నపాల బక్కయ్య, పాకాల లింగయ్య, రొయ్య గోపాల్, సుంకరబోయిన నాగయ్య, కోనేటి లింగస్వామి, సింగపంగ నర్సింహ ఉన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోనేటి యాదగిరి, పల్లపు బుద్ధుడు, పోలగోని స్వామి, ఉయ్యాల లింగయ్య, పట్ల జనార్ధన్, జన్నపాల శ్రీను, పాకాల దినేష్, కురుపటి లింగయ్య, ఉయ్యాల మల్లేష్, శ్రీను, వస్కుల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## టీటీసీ ఉత్తీర్ణత సాధించాలంటే నా కోర్కె తీర్చాలి

**● నల్లగొండ డైట్‌లో విద్యార్థినికి లైంగిక వేధింపులు**

**● జూలై నెలలో ఘటన...ఆలస్యంగా వెలుగులోకి ● విచారణకు ఆదేశించిన డీఈవో**

నల్లగొండ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ శిక్షణ కోర్సు(టీటీసీ) ఉత్తీర్ణత కావాలంటే తన కోర్కె తీర్చాలని ఓ విద్యార్థినిని డైట్ కళాశాల పరిధిలోని ఓ ఉపాధ్యాయుడు లైంగికంగా వేధించాడు. మూడు నెలల క్రితం జరిగిన ఈ ఘటనపై శుక్రవారం వెలుగులోకి వచ్చింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. నల్లగొండ జిల్లా కలెక్టరేట్‌కు సమీపంలో ఉన్న జిల్లా విద్యాశిక్షణా సంస్థ(డైట్)లో జిల్లా విద్యాశాఖకు చెందిన పలు కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. డైట్ కళాశాలలో టీటీసీ కోర్సు చేస్తున్న ఓ విద్యార్థిని టీచింగ్ ప్రాక్టీస్ నిమిత్తం అదే కళాశాల పరిధిలో ఉన్న పాఠశాలకు వెళ్లింది. అక్కడ ఓ ఉపాధ్యాయుడు కోర్సులో ఉత్తీర్ణత సాధించాలంటే తాను చెప్పినట్టు వినాలని, తన కోరిక తీర్చాలని తరచుగా ఆ విద్యార్థినిని లైంగిక వేధింపులకు గురి చేశారు. సంబంధిత ఉపాధ్యాయుడు బెదిరింపులకు పాల్పడటంతో పోలీసులకు ఫిర్యాదు చేయలేదు. ఇదే విషయాన్ని బాధిత విద్యార్థిని తల్లిదండ్రులకు చెప్పుకుని బాధపడటంతో విషయం వెలుగుచూసింది. ఈ ఘటనపై ఇప్పటివరకు ఫిర్యాదు అందలేదని, విద్యార్థినికి న్యాయం చేస్తామని, ధైర్యం కల్పించి భరోసా ఇస్తామని డీఈవో బొల్లారం భిక్షపతి తెలిపారు. ఈ ఘటనపై విచారణకు ఆదేశించామని, నల్లగొండ ఎంఈవో అరుంధతితో పాటు, డైట్ ప్రిన్సిపాల్ నర్సింహను విచారణ అధికారులుగా నియమించామన్నారు.

## ఫిజియోథెరపీలో అన్నాచెల్లెళ్ల ప్రతిభ



అన్నా చెల్లెళ్లను సన్మానిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

నకిరేకల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఫిజియోథెరపీ విద్యలో నకిరేకల్‌కు చెందిన ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు మాచర్ల సైదులు మాదిగ కుమారుడు జగ్జీవన్‌రామ్, మీరాకుమారి ఉత్తీర్ణత సాధించారు. ఫిజియోథెరపీ ఉన్నత విద్యలో ప్రతిభ కనబరిచిన జగ్జీవన్‌రామ్, మీరాకుమారిని ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే వేముల వీరేశం అభినందించారు. ఫిజియోథెరపీ డాక్టర్లుగా రాణించి పేద ప్రజలకు సహాయ సహకారాలు అందించాలని వారు సూచించారు.

## లిటిల్ సోల్జర్‌టీం ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న లిటిల్‌సోల్జర్ టీం సభ్యులు

కట్టంగూరు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని అయిటిపాముల గ్రామానికి చెందిన రాపర్తి నాగలక్ష్మి అనే మహిళ పది రోజుల క్రితం గ్రామశివారులో మేకలు మేపుతుండగా ట్రాక్టర్ వచ్చి ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఆమె ప్రస్తుతం హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. నాగలక్ష్మి నిరుపేద కుటుంబం కావడంతో వైద్య ఖర్చుల భరించలేక ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న నకిరేకల్‌లోని లిటిల్ సోల్జర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బ్రహ్మదేవర నరేష్ తమ ఫౌండేషన్ సభ్యులతో కలిసి శుక్రవారం సాయంత్రం అయిటిపాముల గ్రామంలో నాగలక్ష్మి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఫౌండేషన్ తరపున రూ.25200లు ఆర్థికసాయం అందించి మానవత్వం చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో గుండు విక్రమ్, అనిల్, హరిప్రసాద్, ఉపేందర్, గోపగోని పరమేష్, మారయ్య, సైదులు, మదు, అంతయ్య, యాదగిరి పాల్గొన్నారు. ఆర్థికసాయం అందించిన లిటిల్ సోల్జర్ ఫౌండేషన్‌కు బాధిత కుటుంబసభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

## క్రీడల్లో పెద్దకాపర్తి విద్యార్థుల ప్రతిభ



నియోజకవర్గ స్థాయిలో విజయం పెద్దకాపర్తి విద్యార్థులు

చిట్యాలరూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నియోజకవర్గస్థాయిలో జరిగిన పోటీలో చిట్యాల మండలం పెద్దకాపర్తికి చెందిన విద్యార్థులు ప్రతిభను చూపి ప్రథమస్థానాన్ని సాధించారు. అండర్-17 విభాగంలో బాల, బాలికల ఖోఖో ఆటలో పెద్దకాపర్తి జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు ఆటలో అత్యుత్తమ ప్రతిభను కనబరచి ప్రథమస్థానాన్ని కైవసం చేసుకున్నారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతినందించి నిర్వాహకులు అభినందించారు. ప్రథమస్థానంలో నిలిచిన విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు.

**వల్లాల మోడల్ స్కూల్ బాలికల విజయం**

శాలిగౌరారం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): నకిరేకల్ అవుట్ డోర్ స్టేడియంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి బాలికల అండర్ - 17 కబడ్డీ క్రీడా పోటీలో ఫైనల్‌లో కేతేపల్లి మండలంపై శాలిగౌరారం మండలం నుంచి వల్లాల మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చి ప్రథమ బహుమతి సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణమోహన్ తెలిపారు. విద్యార్థులను పీడీ బొడ్డు మల్లేష్‌ను, ఉపాధ్యాయులను ప్రిన్సిపాల్ కృష్ణమోహన్ అభినందించారు.

## గ్రీన్‌మెంటర్ అవార్డుకు గోపాల్‌రెడ్డి ఎంపిక

**● న్యూయార్క్‌లో అందుకోనున్న పురస్కారం**

**● ఇటీవలే ఉత్తమ పర్యావరణవేత్త -2025 అవార్డు అందుకున్న గోపాల్‌రెడ్డి**



నార్కట్‌పల్లి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి మండలంలోని బ్రాహ్మణవెల్లెంల గ్రామానికి చెందిన కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి ప్రతిష్ఠాత్మకమైన గ్లోబల్ గ్రీన్‌మెంటర్ అవార్డుకు ఎంపికయ్యారు. అమెరికాలోని న్యూయార్క్ నగరంలో నిర్వహించే తొమ్మిదో న్యూయార్క్ గ్రీన్ స్కూల్ కాన్ఫరెన్స్-2025లో ఆయన ఈ పురస్కారాన్ని అందుకునేందుకు గోపాల్‌రెడ్డి యూఎస్ వెళ్లారు. లోటస్‌లాప్ స్కూల్స్‌ను స్థాపించి విద్యావేత్తగా పేరుగాంచిన కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి పర్యావరణ ప్రేమికునిగా పర్యావరణ పరిరక్షణకు గత 25ఏళ్లుగా కృషి చేస్తున్నాడు. వృక్షార్చన, పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ వస్తువుల వాడకం వంటి అంశాలపై ఎన్నో అవగాహన సదస్సులు నిర్వహించిన కృషికి గుర్తింపుగా ఇటీవలే ఆయన ఉత్తమ పర్యావరణవేత్త-2025 అవార్డును తెలంగాణా కౌన్సిల్ ఫర్ ఎడ్యుకేషన్ చైర్మన్ ప్రొఫెసర్ బాలకృష్ణ చేతుల మీదుగా హైద్రాబాద్‌లోని ఉన్నత విద్యామండలిలో తెలంగాణ మేధావుల ఫోరం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అందుకున్నారు. కాగా ఉత్తమ పర్యావరణ వేత్త అవార్డుతో పాటు న్యూయార్క్‌లో నిర్వహించే 2025 గ్రీన్ స్కూల్ కాన్ఫరెన్స్‌లో గ్లోబల్ గ్రీన్‌మెంటర్ అవార్డుకు ఎంపికైన కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డిని పలువురు అభినందించారు.

## మూడున్నర నెలలు.. 66వేల మెట్రిక్ టన్నులు

(5వ పేజీ తరువాయి)



రైతు వేదిక వద్ద రైతులతో మాట్లాడుతున్న జేడీఏ శ్రవణ్‌కుమార్

సెప్టెంబరులో ముసురుతో కూడిన వర్షాలు కురియడంతో పత్తి, వరికి అధికంగా రైతులు యూరియాను వినియోగించారు. యూరియా తక్కువ ధరకు అందుబాటులో ఉండటంతో మోతాదుకు మించి పంటలకు ఎరువు వినియోగించినట్టు అధికారులు గుర్తించింది. అధికంగా ఎరువుల వినియోగంతో పంటలకు తెగుళ్ల వస్తాయని, రైతులు అవసరం మేరకే ఎరువులు వాడాలని సూచిస్తూ వస్తున్నారు. అయినా రైతులు పెద్ద మొత్తంలో ఎరువులను వినియోగించినట్టు తెలుస్తోంది. శుక్రవారం జిల్లాకు 1,300 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా కాగా, రైతులకు పంపిణీ చేశారు. పత్తి, వరి చేలకు అధికంగా యూరియా ఉంటుందని గుర్తించిన అధికారులు, ఎరువులు అవసరం ఉన్న రైతులు మాత్రమే కొనుగోలు చేయాలని సూచించారు. అయితే భవిష్యత్తులో యూరియా వస్తుందో లేదో అనే అనుమానాలతో పలు కేంద్రాల వద్ద రైతులు బారులు తీరిన పరిస్థితులు కన్పించాయి. ఇక అక్టోబరు మొదటి వారం నుంచి నాన్ ఆయకట్టులో వరి కోతలు ప్రారంభంకానున్నాయి. ఈ నేపథ్యంలో యూరియా వినియోగం తగ్గడమేగాక ఒత్తిడి కూడా తగ్గే అవకాశాలు ఉన్నాయి. అదేవిధంగా పత్తి పంటకు సంబంధించి దసరా పండుగ తరువాత పత్తితీతకు అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే పత్తికి యూరియా వినియోగాన్ని రైతులు నిలిపివేశారు. దీంతో మరో 4 వేల మెట్రిక్ టన్నులు జిల్లాకు వస్తే రైతులకు యూరియా సరిపోతుందని వ్యవసాయశాఖ అంచనా వేస్తోంది.

**45 రైతు వేదికల ద్వారా పంపిణీ**

రైతులకు యూరియాను చేరువ చేయడం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లాలోని 45 రైతు వేదికల ద్వారా యూరియాను రైతులకు అందజేశారు. మండల కేంద్రాలతో పాటు పట్టణ కేంద్రాల్లోని పీఏసీఎస్‌లు, ఎరువుల దుకాణాల వద్ద ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశ్యంతోనే రైతు వేదికల ద్వారా ఇప్పటి వరకు 1,300 మెట్రిక్ టన్నుల యూరియాను సరఫరా చేశారు. రైతు వేదికల ద్వారా యూరియా సరఫరా చేయడంతో ఎంతో ప్రయోజనం చేకూరిందనేది ప్రభుత్వం అంచనా. ఈ విధానం సత్ఫలితాలు ఇచ్చింది. మరో రెండు, మూడు రోజుల్లో మరికొంత యూరియా జిల్లాకు రానున్నట్లు సమాచారం. ఎక్కడైతే యూరియా అవసరం అధికంగా ఉందో ఆయా ప్రాంతాలను గుర్తించి రైతులకు చేరేలా వ్యవసాయశాఖ ప్రణాళిక రూపొందించి రైతు వేదికలను కేంద్రంగా చేసుకుంది. శుక్రవారం జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్‌కుమార్ నల్లగొండ మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్‌తో కలిసి నల్లగొండ మండలంలోని రైతు వేదికల్లో యూరియా సరఫరాను పర్యవేక్షించారు. అదేవిధంగా జేడీఏ కనగల్ మండలంలోని చిన్న మాదారంలో రైతువేదికల్లో యూరియా సరఫరాను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు సంతృప్తి వ్యక్తం చేయడంతో ఈ విధానం ద్వారా ఇబ్బందులు లేకుండా చూడాలని జిల్లా వ్యవసాయశాఖ నిర్ణయించింది.

**ఎన్ఎస్ఎస్ యూనిట్ అనుమతివ్వడంపై హర్షం**

కనగల్, సెప్టెంబరు 19: (ఆంధ్రజ్యోతి) మండల కేంద్రంలోని శ్రీఅక్కినేపల్లి వెంకటేశ్వర మెమోరియల్ మోడల్‌స్కూల్, కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఏర్పాటుకు అనుమతినిస్తూ మహాత్మాగాంధీ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ మద్దిలేటి పసుపులు పాఠశాల ప్రిన్సిపల్ థామసయ్యకు శుక్రవారం ఉత్తర్వులను అందజేశారు. కాగా యూనిట్ ఏర్పాటు అనుమతి రావడంపై ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

**డీఎస్పీ మండల అధ్యక్షుడిగా బాలరాజు**

కనగల్ : ధర్మసమాజ్ పార్టీ మండలాధ్యక్షుడిగా మండలంలోని దోరెపల్లి గ్రామానికి చెందిన దాసరి బాలరాజు ఎన్నికయ్యారు. పార్టీ నియోజకరవర్గ ఇన్‌చార్జి శంకర్ అధ్యక్షతన శుక్రవారం కనగల్‌లో నిర్వహించిన సమావేశంలో మండల కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా రవి, ప్రధాన కార్యదర్శిగా ప్రవీణ్, కోశాధికారిగా విజయ్, కార్యదర్శిగాసుధాకర్, కమిటీ సభ్యులుగా వెంకటేశ్ దిలీప్, నాగయ్య, జానయ్య, నవీన్‌ను ఎన్నుకున్నారు

**కార్యదర్శిపై ఎంపీడీవోకు ఫిర్యాదు**

కనగల్ : మండలంలోని జీ యెడవల్లి గ్రామ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన బొమ్మకంటి మహేష్, వివిధ ప్రజా సంఘాల నాయకులు శుక్రవారం ఎంపీడీవో సుమలతకు ఫిర్యాదు చేసారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పారిశుధ్య సమస్యను పరిష్కరించాలని కోరగా దుర్భాషలాడుతున్నట్లు ఆరోపించారు.

**చట్టాలపై అవగాహన ఉండాలి**

కనగల్ : విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సీఐ ఆదిరెడ్డి అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళశాలలో శుక్రవారం నిర్వహించిన అవగాహన సమావేశానికి ఆయన ముఖ్య అధితిగా హాజరై మాట్లాడారు. బాలికలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ రాజీవ్‌రెడ్డి, పీసీలు బేబీషాలినీ, రవీందర్‌రెడ్డి, వెంకన్న, అధ్యాపకులు తదితరులున్నారు.

**రోగులకు పండ్లు పంపిణీ**

కనగల్ : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పుట్టిన రోజును పురస్కరించుకుని శుక్రవారం కనగల్ పీహెచ్‌సీలో బీజేపీ నాయకులు రోగులకు పండ్లను, బ్రెడ్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పిండి పాపిరెడ్డి, తిరందాసు కనకయ్య, బిక్షం, పంతంగి సైదులు ఉన్నారు.

**సంఘభవనం వివాదం పరిష్కరించాలి**

చిట్యాల :చిట్యాలలోని స్వర్ణకార సంఘ భవనంపై నెలకొన్న వివాదం పరిష్కరించాలని కోరుతూ మండల స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఎమ్మెల్యే వీరేశానికి వినతిపత్రం ఇచ్చారు. 2019లో గ్రామ పంచాయతీ ఇచ్చిన స్థలంలో తాము భవనం నిర్మించుకోగా కొందరు కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని, తమకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు చోల్లేటి ఓంప్రకాష్, చోల్లేటి వెంకటరమణ, నర్సింహచారి, పాల్గొన్నారు.

**ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే యూరియా కొరత**

మర్రిగూడ : ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే యూరియా కోసం రైతులు నేడు రోడ్డు ఎక్కుతున్నారని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తోటకూర శంకర్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్‌హయాంలో సాగుకు ఎప్పుడు కూడా యూరియా కొరత ఏర్పడలేదని అన్నారు. సమావేశంలో వెంకట్రావు, శంకర్, శ్రీను, రవిలు ఉన్నారు.

**పేద విద్యార్థికి ల్యాప్‌టాప్ బహూకరణ**

నల్లగొండ రూరల్ : మండలంలోని అన్నెపర్తి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ మొసంగి లింగయ్య కుమార్తె విజయలక్ష్మి బీటెక్ చదువుతోంది. దీంతో అన్నెపర్తి మాజీ సర్పంచ్ అరవింద్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేతుల మీదుగా శుక్రవారం హైదరాబాద్‌లో కార్యాలయంలో ల్యాప్ టాప్ అందజేశారు.

**మర్రిగూడ పీహెచ్‌సీ శివన్నగూడ మార్చాలి**

మర్రిగూడ : మండలకేంద్రంలోని పీహెచ్‌సీలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శివన్నగూడ గ్రామంలో ఏర్పాటు చేయాలని కోరుతూ మాజీ ఎంపీపీ అనంత రాజు గౌడ్ రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ రవీందర్ నాయక్‌కు కలిసి శుక్రవారం వినతి పత్రం అందజేశారు. మండల కేంద్రంలో 30 పడకల సామాజిక ఆరోగ్య ప్రభుత్వ ఆస్పత్రి ఉందని, అదే చోటులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కూడా ఉందనట్లు తెలిపారు. పేద ప్రజకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని వినతి పత్రంలో కమిషనర్‌ను కోరినట్లు ఆయన తెలిపారు.


**దుర్గమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి**

మునుగోడు : మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి శుక్రవారం విజయవాడ కనుకదుర్గామాత ఆలయాన్ని దర్శించుకున్నారు. నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ ముఖ్యనేతలు, ఆయన అనుచరులతో కలిసి ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. రెండు రోజుల క్రితం గుంటూరులో జరిగిన ఓ కార్యక్రమంలో హాజరయ్యారు. ఆయన వెంట నియోజకవర్గంలోని వివిధ మండలాల నుంచి పలువురు ముఖ్యనేతలు, కార్యకర్తలు అనుచరులు ఉన్నారు

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

గరిష్టం 31.0
కనిష్టం 23.2



ప్రాజెక్టుల నీటిమట్టం

| ప్రాజెక్టు | పూర్తిస్థాయి | ప్రస్తుతం | ఇన్‌ఫ్లో | అవుట్‌ఫ్లో |
|---|---|---|---|---|
| | నీటి మట్టం (అడుగులు) | | (క్యూసెక్కులు) | |
| సాగర్ (టీఎంసీలు) | 590 (312.0450) | 587.20 (305.6242) | 2,78,066 | 2,81,377 |
| మూసీ (టీఎంసీలు) | 645 (4.46) | 643.95 (4.18) | 4,704.02 | 4,255.35 |
| పులిచింతల (టీఎంసీలు) | 175 (45.77) | 172.209 (41.5360) | 2,44,320 | 2,30,351 |

| చికెన్ ధరలు | లైవ్ : రూ.152 | డ్రెస్ : రూ.230 | స్కిన్‌లెస్ : రూ.260 |
|---|---|---|---|



నాంపల్లిలో యూరియా కోసం బారులు తీరిన రైతులు

# మూడున్నర నెలలు.. 66వేల మెట్రిక్ టన్నులు

వానాకాలం సీజన్‌లో జిల్లాలో ఈ మూడున్నర నెలల్లో 66 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు విక్రయించారు. ఈ సీజన్‌కు సంబంధించి మొత్తం 70 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉంటుందని వ్యవసాయశాఖ అంచనా వేసి ప్రభుత్వానికి ఇండెంట్ పెట్టింది. కాగా, ఇప్పటి వరకు 66వేల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా జరిగింది. ఇంకా మరో 4వేల మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాకు రావాల్సి ఉంది.

- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ)

- ఇక రావాల్సిన యూరియా కోటా 4వేల మెట్రిక్ టన్నులు
- అక్టోబరు మొదటి వారంలో నాన్ ఆయకట్టులో వరి కోతలు
- యూరియా కోసం కాస్త ఒత్తిడి తగ్గే అవకాశం

వ్యవసాయ అధికారులు ప్రభుత్వానికి నివేదించిన విధంగా యూరియా సరఫరా చేసే సమయంలోనే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో కొరత ఏర్పడింది. దీంతో జిల్లాలో కూడా కొద్ది రోజులుగా యూరియా కోసం రైతులు రోడ్డెక్కుతున్నారు. శుక్రవారం నాంపల్లి, చింతపల్లి మండలాల్లో యూరియా కోసం రైతులు బారులు తీరారు. అయితే జూన్, జూలైలో పెద్దగా వర్షాలు లేకపోవడంతో ఆగస్టులో కురిసిన వర్షాలకు పత్తి విత్తనాలు వేయడంతో పాటు వరినాట్లు ముమ్మరమయ్యాయి. సెప్టెంబరులోనూ ఆడపదడపా వర్షాలు కురియడంతో రైతులు ఎరువుల కోసం ఎగబడ్డారు. దీంతో ఎరువుల సరఫరా వ్యవసాయ అధికారులకు సమస్య గా మారింది. కర్నాటక, మహారాష్ట్రలో భారీ వర్షా లు కురవడంతో నాగార్జునసాగర్ రిజర్వాయర్‌కు వరద రావడాన్ని గమనించి ఆయకట్టు రైతులు జూలై మాసంలోనే పెద్ద మొత్తంలో యూరియాను కొనుగోలు చేసి నిల్వ చేసినట్టు చర్చ సాగింది. ఆ తరువాత సాగర్ పూర్తిగా నిండి ఎడమ కాల్వకు నీటి విడుదల ప్రారంభమవడంతో సాగర్ ఆయకట్టు కింద ముమ్మరంగా నాట్లు కొనసాగడంతో యూరియా అవసరం మరింత పెరిగింది. జిల్లాకు ఈ మూడున్నర నెలల్లో అంటే జూన్ నుంచి సెప్టెంబరు మూడో వారం వరకు 66వేల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా కాగా, ఆ మొత్తాన్ని రైతులకు విక్రయించారు. ఇంకా కోట ప్రకారం మరో 4వేల మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాకు రావాల్సి ఉంది.

### 11లక్షలకు పైగా ఎకరాల్లో పంటల సాగు

జిల్లాలో 11.6లక్షల ఎకరాల్లో పత్తి, వరి సాగైంది. 5.68లక్షల ఎకరాల్లో పత్తి సాగు కాగా, 5.38లక్షల ఎకరాల్లో వరి సేద్యమైంది. గత ఏడాది కంటే 40వేల ఎకరాలు అధికంగా పత్తి, వరి పంటలు సాగయ్యాయి. నాన్ ఆయకట్టులో అధికంగా పత్తి సాగు కాగా, ఆయకట్టుతో పాటు నాన్ ఆయకట్టులోనూ వరిసాగైంది. ఈసారి..


- మిగతా 8వ పేజీలో...




### రైతులకు ఇబ్బందులు లేకుండా యూరియా

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లాలో రైతులకు యూరియా కొరత లేకుండా సరఫరా చేస్తున్నాం. ఇప్పటికే 66వేల మెట్రిక్ టన్నుల యూరియాను చేరవేశాం. ఎప్పటికప్పుడూ పర్యవేక్షణ చేస్తూ క్షేత్రస్థాయిలో రైతులకు ఇబ్బందులు రాకుండా చూస్తున్నాం. నిరంతరం మండల వ్యవసాయ అధికారులతో సమీక్షలు నిర్వహిస్తున్నాం. మరో 10 రోజుల్లో నాన్ ఆయకట్టులో వరి కోతలు ప్రారంభంకానున్నాయి. పత్తి తీత కూడా మొదలవనుంది. దీంతో యూరియా అవసరం తగ్గుతుంది. ఇప్పటికే పత్తి చేలకు రైతులు యూరియాను నిలిపివేశారు. పత్తి పంటకు ప్రస్తుతం యూరియా అవసరం లేదు. ఆయకట్టులో వరిచేలకు కొంత మేర యూరియా అవసరం ఉంటుంది.

- పి.శ్రవణ్‌కుమార్, జేడీఏ

# అందని కాస్మెటిక్, డైట్‌చార్జీలు

### మూడు నెలలుగా విద్యార్థుల ఎదురుచూపులు



(ఫైల్)

విద్యాసంవత్సరం ప్రారంభంలోనే విద్యార్థులకు అందించాల్సిన కాస్మెటిక్, డైట్ చార్జీలు మూడు నెలలు కావస్తున్నా నేటికీ అందలేదు. దీంతో కనీస అవసరాల కోసం గురుకులాల్లో చదువుకునే పేద విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికి తోడు దుస్తులు కూడా ఇవ్వకపోవడంతో పాతవాటితోనే కాలం వెల్లబుచ్చుతున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 79 గురుకులాల్లో 5వ తరగతి నుంచి డిగ్రీ వరకు 37,500 మంది విద్యనభ్యసిస్తున్నారు. వీరెవరికీ కాస్మెటిక్, డైట్ చార్జీలతో పాటు దుస్తులు అందించలేదు. చార్జీలను పెంచిన ప్రభుత్వం సకాలంలో అందిస్తే మేలు చేసినట్లవుతుందని విద్యార్థులు, తల్లిదండ్రులు పేర్కొంటున్నారు.

(ఆంధ్రజ్యోతి-కోదాడ)


6


# సాగునీటి లెక్కల్లో తేడాలు లేకుండా చూడాలి

- కేఆర్ఎంబీ చైర్మన్ బీపీ పాండ్యే
- ఎడమ కాల్వ, ప్రధాన జలవిద్యుత్ కేంద్రాల వద్ద టెలిమెట్రీల పరిశీలన


7




# మహిళలకు అండగా 'భరోసా'

### ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): లైంగిక వేధింపులకు గురైన బాధిత బాలికలకు, మహిళలకు 'భరోసా' కేంద్రం అండగా నిలుస్తోందని ఎస్పీ శరత్ చంద్ర పవార్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని భరోసా కేంద్రాన్ని ఆయన తనిఖీచేసి కార్యాలయంలోని రికార్డులు, సిబ్బంది విధులు, బాధిత మహిళలు, పిల్లల రక్షణకు తీసుకుంటున్న చర్యలు, వైద్య, మానసిక కౌన్సిలింగ్, అవగాహన కార్యక్రమాల పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, లైంగిక దాడులకు, వేధింపులకు గురవుతున్న బాలల పట్ల, మహిళల పట్ల మానవతా దృక్పథంతో పని చేయాలని, వారికి సామాజిక అభద్రతా భావం ఏర్పడకుండా ధైర్యం కల్పించాలన్నారు. ఎప్పటికప్పుడు న్యాయ, వైద్య సహాయం, మానసిక ధైర్యం కల్పించాలన్నారు. లైంగిక వేధింపులపై మహిళలు ధైర్యంగా ఫిర్యాదు చేయాలన్నారు. మహిళలు, బాలల రక్షణ చట్టాలు బలోపేతమయ్యాయని, ఎవరైనా వేధింపులు, లైంగిక దాడులకు పాల్పడితే జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు. పిల్లలపై లైంగిక దాడులు చేస్తే పోక్సో చట్టం కింద జీవితకాలం శిక్ష పడుతుందన్నారు. సాంకేతికత ఆధారాలతో నాణ్యమైన దర్యాప్తును చేస్తున్నామని తెలిపారు. ఇప్పటి వరకూ జిల్లాలో 19 పోక్సో కేసుల్లో, 20 మంది నిందితులకు శిక్షలు విధించడం జరిగిందన్నారు. లైంగిక వేధింపులకు గురైన బాధిత కుటుంబానికి ఆర్థిక పరిహారం అందిస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట అదనపు ఎస్పీ రమేష్, మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ కరుణాకర్, భరోసా సెంటర్ ఎస్ఐ అంజలి, షీటీమ్స్ ఎస్ఐ గౌస్, భరోసా సెంటర్ కో ఆర్డినేటర్ నళిని, తదితరులు ఉన్నారు.

# ఆసక్తి కలిగించేలా బోధన ఉండాలి

### డీఈవో భిక్షపతి




రాష్ట్రస్థాయికి ఎంపికైన ఉపాధ్యాయురాలికి ప్రశంసాపత్రం అందజేస్తున్న డీఈవో భిక్షపతి

నల్లగొండ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): బోధన అభ్యసన ప్రక్రియలతో విద్యార్థులకు పాఠ్యాంశాలపై ఆసక్తి పెరుగుతుందని డీఈవో భిక్షపతి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాలలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి బోధన అభ్యసన సామగ్రి (టీఎల్ఎం) మేళాను ఆయన ప్రారంభించి మాట్లాడారు. టీఎల్ఎం ద్వారా ఉపాధ్యాయులు బోధనను అత్యంత ప్రతిభావంతంగా నిర్వహించవచ్చన్నారు. బోధన అభ్యసన ప్రక్రియల ద్వారా విద్యార్థులకు సులభతరంగా అర్థం కావడంతో పాటు ఆలోచనా విధానం పెరుగుతుందన్నారు. అనంతరం జిల్లాలోని 342మంది ఉపాధ్యాయులు రూపొందించిన టీఎల్ఎంలను ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలో అత్యుత్తమమైన 8 టీఎల్ఎంలను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన ఉపాధ్యాయులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష కోఆర్డినేటర్ ఆర్.రామచంద్రయ్య, డైట్ లెక్చరర్ నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**రాష్ట్రస్థాయికి ఎంపికైంది వీరే:** డి.కల్పన (గొల్లగూడ జీపీఎస్, నల్లగొండ), టీ.వనిత (ఉప్పలపహాడ్ ఎంపీపీఎస్, కేతేపల్లి), సంపత్ (ఎంపీపీఎస్ థానేదార్ పల్లి, గుర్రంపోడు), ఎ.శ్రీనివాసులు (ఎంపీపీఎస్ ఇటుకలపహాడ్, శాలిగౌరారం) ఎల్.శ్రీను (ఎంపీపీఎస్ కోయబోరేనిబాలు, గుర్రంపోడు), డి.శ్రీనివాస్‌రెడ్డి (ఎంపీపీఎస్ కేశంనేనిపల్లి), జీ.అరుణ (ఎంపీపీఎస్ దాసరినెమలిపురి, గుండ్లపల్లి)

# విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

### డీఎంహెచ్‌వో శ్రీనివాస్



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో శ్రీనివాస్

చండూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా వైద్యాధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం చండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 'స్వస్థ్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్' ద్వారా ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డితో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహిళలకు అవసరమైన వైద్య సేవలు అందించడంతో పాటు దీర్ఘకాలిక వ్యాధులను గుర్తించి వైద్యం అందించాలన్నారు. వైద్య సిబ్బంది హాజరు, వ్యాక్సిన్, మందుల నిల్వలను పరిశీలించారు. ఆయన వెంట మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బ్లేసీ ఉన్నారు.

# పోషణ మాసాన్ని నిర్వహించాలి

### కలెక్టర్ ఇలా త్రిపాఠి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ టౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పోషణ మాసం ఉత్సవాలను వినూత్నంగా నిర్వహించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు అక్టోబరు 16వ తేదీ వరకు పోషణ మాసం నిర్వహించాలన్నారు. అందులో భాగంగా ప్రతీ రోజు వివిధ స్థాయిల్లో పలు కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. పాలిచ్చే తల్లులకు కౌన్సిలింగ్, ఎక్కువ బరువును తగ్గించే ఆహారంపై అవగాహన కల్పించాలన్నారు. పిల్లలకు పోషకాహారం అందజేయడంలో పురుషులను భాగస్వామ్యం చేయడం, స్థానిక వంటకాలను ప్రోత్సహించడం, పిల్లలు ఆడుకునేందుకు స్థానికంగా దొరికే చెక్క బొమ్మలు, కర్ర బొమ్మలు, మట్టితో తయారు చేసిన బొమ్మల వాడకంపై అవగాహన కల్పించాలన్నారు. పౌష్టికాహార మిషన్ కింద 100 రోజుల ప్రణాళికను రూపొందించాలని సూచించారు. యోగ, రక్తహీనతపై అవగాహన సదస్సులు, గ్రామ, వార్డు సభల నిర్వహణ, కిచెన్ గార్డెన్ల పెంపకం, పోషణ వాటికల నిర్మాణం, చేతులు శుభ్రంగా కడుక్కోవడం, తాగునీరు, పరిశుభ్రత వంటి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. సొంత భవనాలు ఉన్న 625 అంగన్‌వాడీ కేంద్రాల్లో కనీసం 425 ప్రాంతాల్లో కిచెన్ గార్డెన్లు నిర్వహించాలన్నారు. ప్రహరీలు లేని అంగన్‌వాడీలకు బయో కంచె ఏర్పాటు చేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు భవనాల నిర్మాణానికి స్థలాలను గుర్తించాలన్నారు. స్థానిక శాసనసభ్యుల సహకారంతో సీడీపీవోలు ఒక రోజు పోషణ మాసోత్సవాలను ఘనంగా నిర్వహించాలని అన్నారు. అనంతరం పోషణ మాసంపై రూపొందించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్, జేడీఏ శ్రవణ్‌కుమార్, ఆర్డీవో వై.అశోక్ రెడ్డి, డీఆర్డీవో శేఖర్‌రెడ్డి, శిశు సంక్షేమశాఖ జిల్లా అధికారి కృష్ణవేణి, డిప్యూటీ డీఎంహెచ్‌వో వేణుగోపాల్‌రెడ్డి, పాల్గొన్నారు.

### ఇసుకను అభివృద్ధి పనులకు ఉపయోగించాలి

వంగమర్తి ఇసుక రీచ్‌లో పూడిక ద్వారా తీసిన 5.50లక్షల మెట్రిక్ టన్నుల ఇసుకను ప్రభుత్వ అభివృద్ధి పనులకు వినియోగించుకునేందుకు జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం తీర్మానించింది. ఈ మేరకు కలెక్టర్ ఇలా త్రిపాఠి అధ్యక్షతన శుక్రవారం జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం నిర్ణయం తీసుకుంది. మే నెలలో నిర్వహించిన జిల్లాస్థాయి సమావేశంలో వంగమర్తి ముంపు ప్రాంతంలో సుమారు 8 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుకను అభివృద్ధి పనులకు వినియోగించుకోవాలని ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ఇరిగేషన్ ప్రాజెక్టులకు ఈ ఇసుకను ఇప్పటివరకు వినియోగించుకోనందున దాన్ని సద్వినియోగం చేసుకునేందుకు కమిటీ చర్చించి 5.50లక్షల మెట్రిక్ టన్నుల ఇసుకను కేటాయించింది. ఈ ఇసుకను టీజీఎండీసీకి బదలాయించడం ద్వారా అక్కడి నుంచి ఇరిగేషన్ ప్రాజెక్టులు, ఇందిరమ్మ ఇళ్ల సాండ్‌బజార్‌కు కేటాయించేలా తీర్మానించారు. దీంతోపాటు జిల్లాలో మరో ఐదు ఇసుక రీచ్‌లను గుర్తించి వాటి ద్వారా ఇసుకను ఇచ్చేందుకు చర్చించారు. బ్రాహ్మణపల్లి తండ, వావిల్ కోల్ రీచుల నుంచి డిండి, చందంపేట, పెద్దవూర, పీఏ.పల్లి, కొండమల్లేపల్లి మండలాల్లోని ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక సరఫరాకు తీర్మానించారు. కనగల్ మండలం ఎం.గౌరారం నుంచి అనుముల, గుర్రంపోడు, పెద్దవూర, తిరుమలగిరిసాగర్, త్రిపురారం, కనగల్ మండలాలకు, వంగమర్తి, చిత్తలూరు మూసీ ఎగువ ప్రాంతం నుంచి తీసిన ఇసుకను కేతేపల్లి, కట్టంగూర్, నకిరేకల్ మండలాల్లోని ఇందిరమ్మ ఇళ్లకు ఇవ్వాలని నిర్ణయించారు. తాటికల్‌లో గత ఫిబ్రవరిలోనే ఏర్పాటుచేసిన ఇసుక రీచ్ నుంచి తక్షణమే ఇసుకను సరఫరా చేసేందుకు సమావేశం అంగీకరించింది. చిట్యాలో ఇసుక కొరతను తీర్చేందుకు అవసరమైన మేర సరఫరాకు సమావేశం ఆమోదించింది. సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, మైన్స్ ఏడీ శామ్యూల్ జాకబ్, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

# బిల్లు చెల్లిస్తేనే స్టేషనరీ!

- జిల్లాలో సుమారు రూ.25లక్షల మేర బకాయిలు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఈజీఎస్ సిబ్బంది




ఉపాధిహామీ పథకం నార్కట్‌పల్లి కార్యాలయం, మరమ్మతులకు నోచుకోని కంప్యూటర్, ప్రింటర్

నార్కట్‌పల్లి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖకు చెందిన (ఈజీఎస్) ఉపాధి హామీ పథకం అమలు కార్యాలయాలకు ఏడాదిన్నరగా స్టేషనరీ బిల్లులు మంజూరు కావడం లేదు. దీంతో స్టేషనరీ కొరత ఏర్పడి ఈజీఎస్ కార్యాలయాల సిబ్బంది తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. జిల్లా అధికారులు రోజువారీ అడిగే వివరాల తయారీ కోసం వినియోగించే కాగితాలు, ఇతర స్టేషనరీ వస్తువుల్లో అత్యవసరమైన వాటిని ఈజీఎస్ ఏపీవో లేదా కార్యాలయ సిబ్బంది ఎవరో ఒకరు సొంతంగా వెచ్చించి సమకూర్చుకుంటున్నారు. ఏడాదిగా బిల్లులు ఇవ్వకపోవడంతో కొన్నేళ్లుగా అరువుగా ఇస్తున్న స్టేషనరీ షాపు నిర్వాహకులు నిరాకరిస్తున్నారని ఈజీఎస్ సిబ్బంది వాపోతున్నారు. జిల్లాలో ఒక్కో ఈజీఎస్ కార్యాలయానికి సుమారు రూ.65వేలకు పైగా బకాయి బిల్లులు రావాల్సి ఉంది. జిల్లా వ్యాప్తంగా సుమారు రూ.25లక్షలకు పైగా బకాయి ఉన్నట్టు తెలిసింది.

### కేటగిరీ వారీగా స్టేషనరీ బిల్లులు

జిల్లాలోని అన్ని మండలాల ఉపాధి హామీ కార్యాలయాలకు ఒకే రకమైన స్టేషనరీ నిధుల మంజూరు లేదు. స్టేషనరీ ప్రొవిజన్‌కు మండలాలను నాలుగు కేటగిరీలుగా గుర్తించి ప్రతీ (ఆర్థిక సంవత్సరం) ఏడాది కేటాయిస్తున్నారు. ఈజీఎస్ పనిదినాలనే ప్రామాణికంగా చేసుకుని స్టేషనరీ బిల్లులు ఇస్తున్నారు. ఏ, బీ, సీ, డీ కేటగిరీలుగా వర్గీకరించి బిల్లుల కేటాయింపు చేస్తున్నారు. వీటిలో 3లక్షల పనిదినాలకు పైగా ఉన్న మండలాలను ఏ-కేటగిరీ, 2లక్షల నుంచి 3లక్షల పనిదినాలు నమోదైన మండలాలను బీ-కేటగిరీగా, లక్ష నుంచి 2లక్షల పనిదినాలు నమోదైన మండలాలను సీ-కేటగిరీగా, లక్షకు తక్కువ పనిదినాలు నమోదవుతున్న మండలాలను డీ-కేటగిరీగా గుర్తించి బిల్లులు ఇస్తున్నారు. వీటిలో ఏ-కేటగిరీకి ఏడాదికి రూ.1,00,000, బీ-కేటగిరీకి రూ.85,000లు, సీ-కేటగిరీకి రూ.75,000, డీ-కేటగిరీ మండలాలకు రూ.60,000లు బిల్లులు ఇస్తున్నారు.


### ఏడాదిన్నరగా చెల్లించని వైనం

మండలాల నుంచి కేటగిరీ వారీగా కేటాయించిన మేరకు బిల్లులను ఏటా డీఆర్‌డీఏకు పంపిస్తారు. ఉపాధి కూలీల మస్టర్స్, వేజ్ జాబితా, వేజ్ స్లిప్స్, అంచనా తయారీ పనులన్నింటికీ కలిసి సుమారు 200 వరకు పేపర్ బండిళ్లు అవసరమవుతాయి. కాగా, 2023-24 ఆర్థిక సంవత్సరం వరకు మాత్రమే బిల్లులు విడుదలయ్యాయి. 2024-25 కొత్త ఆర్థిక సంవత్సరం ముగిసినా బిల్లులు విడుదల కాకపోగా 2025-26 ఆర్థిక సంవత్సర స్టేషనరీ ప్రొవిజన్స్ నేటికీ కార్యాలయాలకు అందలేదు. దీంతో ఏడాదిగా కార్యాలయాలకు అరువుగా పంపిణీ చేసిన స్టేషనరీకి బిల్లులు ఇవ్వకపోవడంతో వాటిని ఇచ్చేందుకు వ్యాపారస్థులు నిరాకరిస్తున్నారని తెలిసింది. దీంతో అనివార్యమైన పరిస్థితిలో కొందరు ఏపీవోలు సొంత ఖర్చుతోనే వాటిని సమకూర్చుకుంటున్నారు.

### మరమ్మతులకు ఏఎంసీ లేదు?

దాదాపు ఏ కార్పొరేట్ లేదా ప్రభుత్వ కార్యాలయాల్లోనైనా కంప్యూటర్‌లు, డెస్క్‌టాప్, జిరాక్స్ మిషన్ల మరమ్మతులకు ఏఎంసీ ఉంటుంది. ఏటా వీటన్నింటిని సదరు ఏఎంసీ సాంకేతిక నిపుణులు వచ్చి ఒకసారి తనిఖీ చేసి ఏమైనా సమస్యలుంటే సరిచేస్తుంటారు. సాంకేతిక సమస్య వచ్చి అవి మరమ్మతులకు గురైతే ఏఎంసీ పొందిన సంస్థ సిబ్బంది వాటిని సరిచేస్తారు. ఏఎంసీ ఉంటే సర్వీస్ చార్జ్ ఇవ్వకున్నా ఏమైనా కొత్త పరికరాలకు మాత్రమే చార్జ్ చేస్తారు. కానీ, మండలాల్లోని ఈజీఎస్ కార్యాలయాల్లోని పరికరాల మరమ్మతుకు ఏఎంసీ లేదని సమాచారం.

### బకాయిలు వాస్తవమే



జిల్లాలోని 31 ఈజీఎస్ కార్యాలయంతో పాటు జిల్లా కేంద్రంలోని డీఆర్‌డీవో కార్యాలయానికి సంబంధించి ఏడాదిగా స్టేషనరీ బిల్లులు నిలిచిన మాట వాస్తవమే. సుమారు రూ.25లక్షలకు పైగా 2024-25 ఆర్థిక సంవత్సరం స్టేషనరీ ప్రొవిజన్ బిల్లులు రావల్సి ఉంది. డీఆర్‌డీవోకు కేంద్రం గ్రాంటు ఇస్తున్న కారణంగా కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ అడిగిన ప్రొఫార్మాలోనే బిల్లుల బకాయి వివరాలను రెండు రోజుల కిందటే అందజేశాం. అయితే ఆ బిల్లులు ఎపుడు వస్తాయనేది చెప్పలేను.

● శేఖర్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ

### స్థానిక సమస్యల పరిష్కారానికి

# నిధులు ఇవ్వాలి

- ఆ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే
- ఎమ్మెల్యే శ్రీనివాసరెడ్డి సూచనను సమర్థిస్తున్నా
- మెజారిటీ ఎమ్మెల్యేల అభిప్రాయం కూడా ఇదే
- ముఖ్యమంత్రి వాస్తవాన్ని గుర్తించి వ్యవహరించాలి
- ఎక్స్ వేదికగా సీఎంకు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సూచన
- 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన వ్యాసాన్ని ట్యాగ్ చేసిన ఎమ్మెల్యే



నల్లగొండ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తరచూ సంచలన వ్యాఖ్యలు, ట్వీట్లతో రాజకీయవర్గాల్లో చర్చరేకెత్తిస్తోన్న మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి శుక్రవారం ఎక్స్‌వేదికగా మరోసారి సీఎం రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి ట్వీట్ చేశారు. స్థానిక సమస్యల పరిష్కారానికి నిధులివ్వాలని సూచన చేశారు. "అసెంబ్లీ నియోజకవర్గంలోని స్థానిక సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు సమకూర్చాలి. నిధులు కేటాయించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనన్న వాస్తవాన్ని ముఖ్యమంత్రి గుర్తించి వ్యవహరించాలి" అని ఎమ్మెల్యే తన ట్వీట్‌లో పేర్కొన్నారు. సామాజిక మాధ్యమం ఎక్స్‌లో శుక్రవారం ఈ మేరకు ఆయన ఒక పోస్టును ట్వీట్ చేశారు. మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం 'ఆంధ్రజ్యోతి' ఎడిట్ పేజీలో రాసిన 'ఊరు, వాడ ఇక్కట్లు తీర్చరా.?' అనే ఆర్టికల్‌ను ఈ ట్వీట్‌కు రాజగోపాల్‌రెడ్డి జత చేశారు. అసెంబ్లీ నియోజకవర్గాల్లో స్థానిక సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు సమకూర్చాలంటూ మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి సూచనను తాను మనస్ఫూర్తిగా సమర్థిస్తున్నానని పేర్కొన్నారు. మెజార్టీ ఎమ్మెల్యేల అభిప్రాయం కూడా ఇదేనని తాను భావిస్తున్నట్లు తెలిపారు. ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు అసెంబ్లీ నియోజకవర్గ అభివృద్ధి నిధులు ఉపయోగపడతాయని అభిప్రాయపడ్డారు. సంక్షేమ పథకాలను కొనసాగిస్తూనే, స్థానిక సమస్యల పరిష్కారానికి అవసరమైన మేరకు నిధులు కేటాయించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని ముఖ్యమంత్రి గుర్తించి వ్యవహరించాలని ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ట్వీట్‌లో సూచించారు.

## నేడు సీఐటీయూ జనరల్‌బాడీ సమావేశం

మిర్యాలగూడ, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): పట్టణ, మండల సీఐటీయూ జనరల్ బాడీ సమావేశం ఈ నెల 20న నిర్వహించనున్నట్లు సంఘం పట్టణ కన్వీనర్ తిరుపతి రాంమూర్తి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలోని హనుమాన్‌పేట సీఐటీయూ కార్యాలయంలో జరిగే సమావేశంలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, జిల్లా మహాసభల నిర్వహణ, సభ్యత్వ నమోదు తదితర అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు.

## విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

దామరచర్ల, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొండ్రపోల్ 11కేవీ ఫీడర్ లైన్ షిఫ్టింగ్ పని చేస్తున్నందున నేడు కొండ్రపోల్ ఫీడర్ పరిధిలోని గ్రామాలకు ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 4గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు మండల విద్యుత్ ఏఈ అబ్దుల్లా హబీబ్ శుక్రవారం తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

## ఎమ్మెల్యే బీఎల్ఆర్‌కు అభినందనల వెల్లువ



బీఎల్ఆర్‌ను సన్మానిస్తున్న రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు

మిర్యాలగూడ, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డికి శుక్రవారం అభినందనలు వెల్లువెత్తాయి. తన కుమారుడి రిసెప్షన్‌ను రద్దు చేసుకొని, అందుకయ్యే ఖర్చు రూ.2కోట్లను రాష్ట్ర ప్రభుత్వానికి అందజేసిన బీఎల్ఆర్‌ను పలువురు నేతలు అభినందించారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కలిసి శాలువాలతో సన్మానించారు. ఎమ్మెల్యేను అభినందించిన వారిలో రెడ్డి సంక్షేమసంఘం మిర్యాలగూడ గౌరవాధ్యక్షుడు కంచర్ల అనంతరెడ్డి, అధ్యక్షుడు అనుముల మధుసూధన్‌రెడ్డి ప్రధాన కార్యదర్శి పాప చెన్నారెడ్డి, నాయకులు నామిరెడ్డి నరసింహారెడ్డి, ఉపేందర్ రెడ్డి, శ్రీరాంరెడ్డి, వెంకట్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు అంబటి సోమన్న, పెరిక వెంకటేశ్వర్లు, రాములు, ఆంజనేయులు, టీడీపీ రాష్ట్ర మాజీ కార్యదర్శి కాసుల సత్యం, కాంగ్రెస్ జిల్లా స్టార్ క్యాంపెయిన్ చైర్మన్ పోలగాని వెంకటేశ్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

దామరచర్ల: మండల కేంద్రంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి చిత్రపటానికి స్థానిక నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేత ధనావత్ సిద్దునాయక్ మాట్లాడుతూ నియోజకవర్గంలో రైతులు ఎదుర్కొంటున్న బాధలను గుర్తించి వారి సంక్షేమానికి, లక్ష మంది రైతులకు ఒక్కో రైతుకు ఒక బస్తా యూరియాను ఉచితంగా అందించాలని కోరుతూ సీఎంకు రూ.2కోట్లను అందించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాజుల శ్రీనివాస్, మాజీ ఎంపీపీ నందిని రవితేజ, మాజీ సర్పంచ్ బంటు కిరణ్, నాయకులు కొర్ర నాగునాయక్ తదితరులు పాల్గొన్నారు.

## పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

మాడ్గులపల్లి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వంనుంచి వచ్చే సబ్సిడీలను సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేకాధికారి, డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం మండలంలోని ఇందుగుల గ్రామంలో జాతీయ పశుసంవర్ధకశాఖ మిషన్ పథకంలో భాగంగా విడుదలైన యూనిట్స్ పరిశీలించి మాట్లాడారు. నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్‌లో బాగంగా విడుదలైన యూనిట్లను ఇందుగుల గ్రామంలో రమావత్ ఉదయశ్రీకి సంబంధించిన పశువుల షెడ్డులో పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనలను అనుసరించి షెడ్డును ఏర్పాటు చేసుకోవాలన్నారు. 2023-24 సంవత్సరంలో మూలధన సబ్సిడీని మొదటి విడతలో విడుదల చేశారు. అనంతరం పశువుల దాణాను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సరోజపావని, పశువైద్యాధికారులు వినయ్‌కుమార్, విక్రమ్, సేవానాయక్ పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలని వినతి

కొండమల్లేపల్లి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): టీఎస్‌పీడీసీఎల్‌లో 15 ఏళ్లుగా పనిచేస్తున్న తమ సమస్యలు పరిష్కరించాలని దేవరకొండ డివిజనల్ ఇంజనీర్ విద్యాసాగర్‌కు స్పాట్ బిల్లింగ్ కార్మికులు వి నతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో రూ.4వేలు, పట్టణాల్లో రూ.6వేలు మాత్రమే అందిస్తున్నారన్నారు.

# బ్రిడ్జి నిర్మాణానికి రూ.1.70కోట్లు

● త్వరలో టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తాం ● మార్నింగ్‌వాక్‌లో దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): దేవరకొండ మండలం మర్రిచెట్టుతండా నుంచి బుడ్డోనితండా దాకు బ్రిడ్జి నిర్మాణానికి రూ.1.70కోట్లు మంజూరు చేసినట్లు దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ తెలిపారు. శుక్రవారం మర్రిచెట్టుతండాలో జనహిత ఎమ్మెల్యే మార్నింగ్‌వాక్ విత్ పీపుల్ కార్యక్రమంలో భాగంగా మర్రిచెట్టుతండాలో మార్నింగ్‌వాక్ నిర్వహించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ఎలా కొనసాగుతుందని కాలనీలోని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బుడ్డోనితండా బ్రిడ్జి కాల్వకు చేరుకొని బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తున్నామని, త్వరలో టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తామన్నారు. దీంతో 40 ఏళ్లుగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్య పరిష్కారం కానుందన్నారు. ఎమ్మెల్యే మార్నింగ్‌వాక్‌తో సమస్యలు పరిష్కారం అవుతున్నాయని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇళ్లు వేగవంతంగా నిర్మించుకోవాలని, ఎప్పటికప్పుడు బిల్లులు అందజేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. మర్రిచెట్టుతండాలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు, సీసీరోడ్ల నిర్మాణ పనులను త్వరలో ప్రారంభిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో దేవరకొండ ఎంపీడీవో డానియెల్, మాజీ సర్పంచ్ శీనునాయక్, కొర్ర గౌతమి రాంసింగ్, కిషన్‌బావోజీ, హనుమంతు వెంకటేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



జనహిత మార్నింగ్‌వాక్‌లో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బాలునాయక్

### మృతుల కుటుంబాలకు ఆర్థిక సహాయం

పీఏపల్లి మండలం ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు కాల్వలో ట్రాక్టర్ బోల్తాపడిన ఘటనలో మృతి చెందిన తొమ్మిది మంది మృతుల కుటుంబాలకు శుక్రవారం దేవరకొండ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బాలునాయక్ చెక్కులను పంపిణీ చేశారు. వద్దిపట్ల గ్రామపంచాయతీలోని పడమటితండాకు చెందిన తొమ్మిది మంది మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.3లక్షల చొప్పున చెక్కులను పంపిణీ చేశారు. మృతుల కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరుతోపాటు అన్ని విధాలుగా ఆదుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి, పీఏపల్లి మాజీ ఎంపీపీ వంగాల ప్రతాప్‌రెడ్డి, సత్యంరెడ్డి, ఎల్లయ్య యాదవ్, బోడ్యానాయక్, కొర్ర రాంసింగ్, సీతరాం, పాల్గొన్నారు.

### పరిసరాలను శుభ్రపరుచుకోవాలి

పరిశుభ్రమైన గ్రామాలు తెలంగాణ భవిష్యత్‌కు తొలి మెట్టు అని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. దేవరకొండ మండలం మైనంపల్లిలో స్వచ్ఛతా హీ సేవా పక్షోత్సవాల ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. గ్రామాల్లోని రహదారులు, నివాస స్థలాలు శుభ్రంగా ఉంచుకోవాలని, పారిశుధ్య చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో దేవరకొండ ఎంపీడీవో డానియెల్, మాజీ ఎంపీటీసీ కొర్ర గౌతమిరాంసింగ్, వెంకటేష్‌గౌడ్ పాల్గొన్నారు.

## రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలి

● ఆర్డీవో రమణారెడ్డి

దేవరకొండ, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): దేవరకొండ మండలంలోని గ్రామాల్లో నూతనంగా నియమించిన జీపీవోలు ప్రజలు, రైతులకు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించాలని దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి కోరారు. శుక్రవారం దేవరకొండ ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన జీపీవోలకు శిక్షణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం సూచించిన నియమ, నిబంధనలు పాటించి సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ తహసీల్దార్ ఆంజనేయులు, డీఏవో కిరణ్మయి, డిప్యూటీ తహసీల్దార్ ఆయూబ్‌ఖాన్, హరీష్‌రెడ్డి పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ఆర్డీవో రమణారెడ్డి

# అంగన్‌వాడీల అరెస్టు అప్రజాస్వామికం




దామరచర్లలో అంగన్‌వాడీ సిబ్బందిని అరెస్ట్ చేసిన పోలీసులు

దామరచర్ల, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని కోరుతున్న అంగన్‌వాడీలు, సీఐటీయూ నాయకులను అరెస్ట్ చేయడం తగదని సీఐటీయూ మండల కార్యదర్శి బైరం దయానంద్ అన్నారు. గురువారం మండలంలోని పలువురు అంగన్‌వాడీ ఆయాలను, సీఐటీయూ నాయకులను వాడపల్లి పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అంగన్‌వాడీ ఆయాలకు కనీస వేతనం అందించాలని, సమస్యలను పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వం ఐసీడీఎస్ వ్యవస్థను నీరుగార్చేలా ప్రయత్నిస్తుందని ఆరోపించారు. సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళనలను ఉధృతం చేస్తామన్నారు.

మిర్యాలగూడ టౌన్: సమస్యలు విన్నవించుకునేందుకు వెళ్తున్న అంగన్‌వాడీ టీచర్లను అరెస్ట్ చేయడం సరికాదని సీఐటీయూ రాష్ట్ర నేత డాక్టర్ మల్లు గౌతంరెడ్డి అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రారంభించాలనుకున్న ప్రీప్రైమరీ తరగతులను పాఠశాలల్లో నిర్వహించేందుకు విద్యాశాఖ ప్రయత్నాలు చేస్తున్న తరుణంలో ప్రజాభవన్‌లో వినతిపత్రం అందించేందుకు వెళ్తున్న టీచర్లను అరెస్టు చేయడం అక్రమమన్నారు. ప్రజాపాలన అంటూ అక్రమ అరెస్టులు తగదని, కాంగ్రెస్ ప్రభుత్వం తీరు మార్చుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా సహాయ కార్యదర్శి బొందు పార్వతి, ఇంద్రపల్లి సైదమ్మ, సోమేశ్వరి, యాదాబాయి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మాజీ ఎంపీపీ పుట్టినరోజు వేడుకలు



రేఖా శ్రీధర్‌రెడ్డికి శుభాకాంక్షలు చెబుతున్న నాయకులు

కొండమల్లేపల్లి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కొండమల్లేపల్లి మాజీ ఎంపీపీ రేఖా శ్రీధర్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసిన ఆమె అనంతరం గురుకుల పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సుమారు 4500 మంది విద్యార్థులకు కేక్‌లను పంచారు. అనంతరం దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే సమక్షంలో ఆమె కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఉట్కూరి వేమన్‌రెడ్డి, కాసర్ల వెంకటేశ్వర్లు, గంధం సురేష్, మంగ్యానాయక్, బక్కలయ్య, విప్పలపల్లి జితేందర్, రమావత్ రాజు, ఏకుల సురేష్, సేవానాయక్ పాల్గొన్నారు.

## విత్తనోత్పత్తిపై దృష్టి సారించాలి

పెద్దఅడిశర్లపల్లి,సెప్టెంబరు19(ఆంధ్రజ్యోతి): రైతులే తమ వ్యవసాయ క్షేత్రాల్లో విత్తనోత్పత్తి చేసుకునే విధంగా ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని, హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని వ్యయసాయ బయో టెక్నాలజీ విభాగం శాస్త్రవేత్త జె.రాజేందర్ అన్నారు. రైతులు తమ వ్యవసాయ క్షేత్రంలో నాణ్యమైన విత్తనాలను ఎంచుకుని మేలైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. శుక్రవారం గుడిపల్లి మండలంలో పలు గ్రామాల్లో క్షేత్రస్థాయిలో వ్యవసాయ పంటలను పరిశీలించారు. స్థానిక వ్యయసాయ అధికారులతో కలిసి వరి విత్తనాలను పరిశీలించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పాండు, ఏఈవోలు దెబోరా, సర్ధార్ పాల్గొన్నారు.

## నిబంధనలు పాటించాలి

● మునిసిపల్ కమిషనర్ సుదర్శన్

దేవరకొండ, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): దేవరకొండ పరిధిలోని వాటర్‌ప్లాంట్ యజమానులు నిబంధనలు పాటించాలని దేవరకొండ మునిసిపల్ కమిషనర్ సుదర్శన్ సూచించారు. శుక్రవారం దేవరకొండ మున్సిపల్ కార్యాలయంలో దేవరకొండ పట్టణంలోని ప్రైవేట్ వాటర్ ప్లాంట్ యజమానులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. మున్సిపాలిటీ నుంచి ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలని కోరారు. ఇళ్లలో పాత టైర్లు, నీటి కుళాయిలు పరిసర ప్రాంతాల్లో నీటిని నిల్వ ఉంచవద్దన్నారు. పాత టైర్లు ఉండడం వల్ల దోమలు విజృంభిస్తాయన్నారు.

## మూడున్నర నెలలు.. 66వేల మెట్రిక్ టన్నులు

(5వపేజీ తరువాయి)

సెప్టెంబరులో ముసురుతో కూడిన వర్షాలు కురియడంతో పత్తి, వరికి అధికంగా రైతులు యూరియాను వినియోగించారు. యూరియా తక్కువ ధరకు అందుబాటులో ఉండటంతో మోతాదుకు మించి పంటలకు ఎరువు వినియోగించినట్టు అధికారులు గుర్తించింది. అధికంగా ఎరువుల వినియోగంతో పంటలకు తెగుళ్లు వస్తాయని, రైతులు అవసరం మేరకే ఎరువులు వాడాలని సూచిస్తూ వస్తున్నారు. అయినా రైతులు పెద్ద మొత్తంలో ఎరువులను వినియోగించినట్టు తెలుస్తోంది. శుక్రవారం జిల్లాకు 1,300 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా కాగా, రైతులకు పంపిణీ చేశారు. పత్తి, వరి చేలకు అధికంగా యూరియా ఉంటుందని గుర్తించిన అధికారులు, ఎరువులు అవసరం ఉన్న రైతులు మాత్రమే కొనుగోలు చేయాలని సూచించారు. అయితే భవిష్యత్‌లో యూరియా వస్తుందో లేదో అనే అనుమానాలతో పలు కేంద్రాల వద్ద రైతులు బారులు తీరిన పరిస్థితులు కన్పించాయి. ఇక అక్టోబరు మొదటి వారం నుంచి నాన్ ఆయకట్టులో వరి కోతలు ప్రారంభంకానున్నాయి. ఈ నేపథ్యంలో యూరియా వినియోగం తగ్గడమేగాక ఒత్తిడి కూడా తగ్గే అవకాశాలు ఉన్నాయి. అదేవిధంగా పత్తి పంటకు సంబంధించి దసరా పండుగ తరువాత పత్తితీతకు అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే పత్తికి యూరియా వినియోగాన్ని రైతులు నిలిపివేశారు. దీంతో మరో 4వేల మెట్రిక్ టన్నులు జిల్లాకు వస్తే రైతులకు యూరియా సరిపోతుందని వ్యవసాయశాఖ అంచనా వేస్తోంది.

### 45 రైతు వేదికల ద్వారా పంపిణీ

రైతులకు యూరియాను చేరువ చేయడం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లాలోని 45 రైతు వేదికల ద్వారా యూరియాను రైతులకు అందజేశారు. మండల కేంద్రాలతో పాటు పట్టణ కేంద్రాల్లోని పీఏసీఎస్‌లు, ఎరువుల దుకాణాల వద్ద ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశ్యంతోనే రైతు వేదికల ద్వారా ఇప్పటి వరకు 1,300 మెట్రిక్ టన్నుల యూరియాను సరఫరా చేశారు. రైతు వేదికల ద్వారా యూరియా సరఫరా చేయడంతో ఎంతో ప్రయోజనం చేకూరిందనేది ప్రభుత్వం అంచనా. ఈ విధానం సత్ఫలితాలు ఇచ్చింది. మరో రెండు, మూడు రోజుల్లో మరికొంత యూరియా జిల్లాకు రానున్నట్లు సమాచారం. ఎక్కడైతే యూరియా అవసరం అధికంగా ఉందో ఆయా ప్రాంతాలను గుర్తించి రైతులకు చేరేలా వ్యవసాయశాఖ ప్రణాళిక రూపొందించి రైతు వేదికలను కేంద్రంగా చేసుకుంది. శుక్రవారం జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్‌కుమార్ నల్లగొండ మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్‌తో కలిసి నల్లగొండ మండలంలోని రైతు వేదికల్లో యూరియా సరఫరాను పర్యవేక్షించారు. అదేవిధంగా జేడీఏ కనగల్ మండలంలోని చిన్న మాదారంలో రైతువేదికల్లో యూరియా సరఫరాను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు సంతృప్తి వ్యక్తం చేయడంతో ఈ విధానం ద్వారా ఇబ్బందులు లేకుండా చూడాలని జిల్లా వ్యవసాయ శాఖ నిర్ణయించింది.



## హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

● మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్



బీఆర్ఎస్‌లో చేరుతున్న నాయకులు

పెద్దఅడిశర్లపల్లి, సెప్టెంబరు19(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని తిరుమలగిరి, గుడిపల్లి మండలంలోని జి.బీమనపల్లి గ్రామాల నుంచి ఇతర పార్టీలకు చెందిన పలువురు కార్యకర్తలు మాజీ ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ ఆయన వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. బీఆర్ఎస్ పార్టీలో చేరిన ప్రతీ కార్యకర్త కుటుంబానికి గులాబీ పార్టీ అండగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు యోల్గురి వల్లపురెడ్డి, బీసీ సెల్ మండల అధ్యక్షుడు బొడ్డుపల్లి మహేందర్, ఆర్వపల్లి నర్సింహ, దేపావత్ నరేందర్‌నాయక్, రాయనబోయిన శ్రీనివాస్ యాదవ్, ఎర్ర యాదగిరి, ఎస్.కె జానీ, రమావత్ దామోదర్‌నాయక్, మూడావత్ కోటేష్, హరినాయక్ పాల్గొన్నారు.

## కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

దామరచర్ల, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలో గ్రామపంచాయతీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ మండల కార్యదర్శి బైరం దయానంద్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీవోకు ఆయన వినతిపత్రం అందించి మాట్లాడారు. పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దుచేయాలని, ప్రమాదవశాత్తు మృతిచెందిన కుటుంబాలకు రూ.20లక్షల నష్ట పరిహారం అందించాలన్నారు. లేదంటే ఈ నెల 24నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో శ్రీరాములు, ఎ.సైదులు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయికి ఎదగాలి

తిరుమలగిరి(సాగర్), సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): పట్టుదలతో క్రీడల్లో రాణించి జాతీయ స్థాయికి ఎదిగేలా కృషి చేయాలని ఎంఈవో కె.శ్రీనివాస్ అన్నారు. రెండు రోజులుగా మండల కేంద్రంలోని జడ్పీహైస్కూల్‌లో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ నియోజకవర్గస్థాయి క్రీడాపోటీలు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా పలు పాఠశాలల విద్యార్థులు పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీల్లో అండర్-14 కబడ్డీ పోటీల్లో అనుముల జట్టు ప్రథమ స్థానంలో, తిరుమలగిరి ద్వితీయ స్థానం, అండర్-17లో ప్రథమ స్థానంలో పెద్దవూర, అనుముల ద్వితీయ స్థానంలో నిలిచాయి. ఖోఖో అండర్-14 విభాగంలో పెద్దవూర ప్రథమ స్థానం, మాడ్గులపల్లి ద్వితీయ స్థానం, అండర్-17 విభాగంలో పెద్దవూర మొదటి స్థానం, తిరుమలగిరి రెండో స్థానం, వాలీబాల్ పోటీల్లో పెద్దవూర మొదటి స్థానంలో, తిరుమలగిరి రెండో స్థానంలో నిలిచాయి. ఈ సందర్భంగా విజేతగా నిలిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు శాగం పెద్దిరెడ్డి, దేవస్థాన కమిటీ చైర్మన్ శాగం నాగిరెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు కోడుమూరు వెంకటరామిరెడ్డి, జ్వాలా నర్సింహారావు పాల్గొన్నారు.

## అంబేడ్కర్ ఆశయాలు సాధించాలి

దేవరకొండ, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలని అంబేడ్కర్ యువజన సంఘం నియోజకవర్గ ఇన్‌చార్జి ఎర్ర ఆంజనేయులు అన్నారు. దేవరకొండ అంబేడ్కర్ యువజన సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ నెల 20 నుంచి 30వరకు నిర్వహించనున్న అంబేడ్కర్ యువజన సంఘం ఆవిర్భావ వేడుకలను విజయవంతం చేయాలన్నారు.



## పౌష్టికాహారాన్ని తప్పకుండా తీసుకోవాలి

చింతపల్లి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలు పోషక విలువలు కలిగిన పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుగుణ తెలిపారు. పోషణమాసంను పురస్కరించుకొని మండలంలోని వీటీనగర్ పీహెచ్‌సీతోపాటు పోలేపల్లి రాంనగర్ అంగన్వాడీ కేంద్రంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు, గర్భిణులు, బాలింతలకు ఆకు కూరలు, గుడ్లు చిరు ధాన్యాలు తప్పకుండా అందజేయాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ వంశీకృష్ణ, హెల్త్ సూపర్‌వైజర్ పద్మ, అంగన్వాడీ టీచర్లు శారద, పద్మ, బాదేపల్లి స్వప్న, లీలావతి, యాదమ్మ, వసంత, మమత పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సుగుణ



## దరఖాస్తుల స్వీకరణ

డిండి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): డిండి మండలంలోని ఎర్రగుంటపల్లి గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో నూతనంగా ప్రారంభించిన ప్రీప్రైమరీ తరగతులకు తాత్కాలిక పద్ధతిన బోధించేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారి గోప్యానాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ఉత్తీర్ణులై 18 నుంచి 44 సంవత్సరాలలోపు వయస్సు కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు వయోపరిమితిలో 5 సంవత్సరాలు, ఎక్స్ సర్వీస్‌మెన్‌కు 3 సంవత్సరాలు, దివ్యాంగులకు 10 సంవత్సరాలు సడలింపు ఉంటుందన్నారు. ఇంటర్ మార్కుల మెరిట్ ఆధారంగా ఎంపిక ఉంటుందన్నారు. ఎంపికైన అభ్యర్థికి నెలకు రూ.8వేలు గౌరవ వేతనం ఉంటుందన్నారు. ఇదే పాఠశాలలో ఆయాగా పనిచేసేందుకు 7వ తరగతి చదివి ఉత్తీర్ణులైనవారు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. పూర్తిచేసిన దరఖాస్తులు ఈ నెల 22న సాయంత్రం 4 గంటల వరకు మండల విద్యాశాఖ అధికారికి అందజేయాలని కోరారు. దరఖాస్తు ఫారాలు డీఈవో నల్లగొండ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

సినిమా గైడ్: మిర్యాలగూడ: శ్రీనివాస : వార్-2, వెంకటేశ్వర: మహావతార్ నరసింహ రాఘవ: కూలీ, విట్రోస్: కూలీ, పరదా, బన్ బటర్ జామ్ దేవరకొండ: మనోజ్ : వార్ 2 మైత్రి వెంకటేశ్వర: మహా అవతార్ నర్సింహ